ప్రజాశక్తి

Vol. 1, no. 13

(Sept. 9, 1942)

బెజవాడ, 1942

Record no. 683

Prajāśakti

Vol. 1, no. 13

(Sept. 9, 1942)

Bejavāḍa, 1942

Record no. 683

10 పేజీలు : 0-1-6

PRAJA SAKTI

Regd. No. M. 4486.

సంపాదక వర్గం :
మద్దుకూరి చంద్రశేఖరరావు
(సంపాదకుడు)
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
తుమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు

ప్రజాశక్తి

అంతర్జాతీయ పార్టీశాఖ
భారత కమ్యూనిస్టుపార్టీ
ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 1 | బుధవారం 9-9-42 బెజవాడ | సంచిక 13

మాస్కోను మరపించుతున్న స్టాలిన్‌గ్రాడ్

కామ్రేడ్ తుమ్మల వెంకటరామయ్య

స్టాలిన్‌గ్రాడ్ భీకరసంగ్రామం. లెనిన్‌గ్రాడ్, మాస్కోలను మరపించుతోంది. గతవారం సాగించిన దాడి మరింత ప్రమాదకరంగా పరిణమించినా, సోవియట్ సైన్యాలు వీరోచితంగా ఎదుర్కొంటున్నాయి. స్టాలిన్‌గ్రాడ్‌కు వాయువ్యంగాను, నైరుతిగాను సాగించిన దాడులు, అత్యంత తీవ్రత దాల్చినాయి. స్టాలిన్‌గ్రాడ్‌కు వాయువ్యంగా సాగినదాడిలో, తీవ్రతలోను, మనుష్యసంఖ్యాబలంలోను, ఇదివరకే పోరాటంలోను ఉపయోగించనంతగా అధికంగా రెండుపక్షాలూ ఉపయోగించు తున్నాయని రెడ్‌స్టార్ పత్రిక వ్రాసింది. నైరుతి నుండి వచ్చుచున్న దాడి వాయువ్యదాడికంటె కొంత ప్రమాదకరంగా వున్నదని ఇదివరకువార్త. స్టాలిన్‌గ్రాడ్ చుట్టూ 25 డివిజన్లను వెయ్యి విమానాలను ఉపయోగించి జర్మనీ త్వరలో స్టాలిన్‌గ్రాడ్ పట్టుకోవాలని ఆతృత పడుతోంది. స్టాలిన్‌గ్రాడ్‌కు వాయువ్యంగా రెండురెట్లు ఒక్కొక చోట మూడురెట్లు అధిక సంఖ్యాబలం జర్మనీకున్నా, సోవియట్ సైన్యాలు జర్మన్ ధాటిని ఆపగల్గుతున్నాయి. స్టాలిన్‌గ్రాడ్‌కు నైరుతిగా జరిగే పోరాటం కూడ, ఈ సంవత్సరంలో ఎన్నడూ జరగనంత భయంకరంగా జరుగుతోంది. ఒక్కరోజులోనే 23 సార్లు వైమానికయుద్ధం జరిగిందంటే, దీని తీవ్రతను వేరే చెప్పనక్కరలేదు. అయినా సోవియట్ సైన్యాలు తమ స్థానాలలో వుండి రక్షించుకొంటున్నాయి.

ఈ వారం మరొక విశేషం. క్లెట్స్కయా ప్రాంతంలో సోవియటు యెదురుదాడి సాగించింది. డాన్ నదిని దాటింది. వాయువ్య భాగంనుండి వచ్చే జర్మన్ సైన్యాలకు గందరగోళం కల్గించుతుంది. ఇచట పార్శ్వపు దాడులలో సోవియటు ఒక పర్వతాన్ని పట్టుకొంది.

మధ్య రంగంలో సోవియటు దాడి సాగుతూనే వుంది. జర్మను సైన్యాలు తీవ్ర ప్రతిఘటన సాగించుతున్నాయి. ఈ రంగానికి 400 జర్మను విమానాలు రప్పించబడినాయి. రెజెవ్‌ను ప్రక్కగా దాటి అనేక గ్రామాలను సోవియటు పట్టుకొన్నది.

మొజ్‌డాక్, ప్రొక్లాడ్నయా ప్రాంతాలలో జర్మనులు టెరెక్ నదని దాటగల్గారు. సోవియటు సైన్యాలు యీ సైన్యాలను తీవ్రంగా నాశనం చేస్తున్నాయి. ఈ నది దక్షిణపు ఒడ్డున యింకా యుద్ధం సాగుతుంది.

నొవారొసిస్క ప్రాంతంలో సోవియటు ఆత్మ రక్షణ యుద్ధాలు సాగించంది. నల్ల సముద్ర నావికులు శత్రు నౌకలను ముంచుతూ వుండడమేగాక, నల్లసముద్రపు ఒక రేవుపై దాడి తీసారు. జర్మను సైన్యాలు, రుమేనియన్ సైన్యాలు నల్ల సముద్ర తీరాన "అనపా"నుండి వచ్చే రోడ్డున ముందుకు వస్తున్నారు.

ఈ వారం అన్ని రంగాలలోను సోవియటుపై ఒత్తిడి తీవ్రంగా హెచ్చి ప్రమాదకరంగా పరిణమించినా మొక్కవోని ధైర్యంతో సోవియటు సైన్యాలు యెదిరించుతున్నాయి.

కాకసస్‌లో సోవియటు ప్రజల దృఢ నిశ్చయం ఈ వార్త వలన విదితమౌతోంది. "ఆర్డ్‌జోనికిడ్జ్"లో పలువురు ఉపన్యాసకులు యిలా వుపన్యసించినట్లు ప్రవదా వ్రాస్తోంది.

"సోవియటు భూమిలో మణిపూస అయిన కాకాసస్‌ను రక్షించుకోడానికి దృఢ నిశ్చయంతో వున్నాం. హిట్లరు అనుచరులకు యిక్కడ మన ఖడ్గాల చవి చూపించి, రక్తపు టేరులలో నాజీలను ముంచాలి. కాకాసస్ పర్వత ప్రాంగణాలు నాజీ దురాక్రమణవాదులకు స్మశాన భూమి యగుగాక !"

ఆదివారంనాడు మాస్కోరేడియో ఇలా ప్రబోధించింది. "మన ప్రాచీన వాల్గానది వైపుకు, కాకాసస్ సంపదల వైపుకు నీచశత్రువు ప్రాకుతున్నాడు. ఇపుడు జరిగే యుద్ధాలపైన మన బ్రతుకో, చావో తేలుతుంది. ఒక్కడుగుకూడా వెనుకకు వేయవద్దు. చచ్చేవరకు నిలబడండి. ఇదే మన మాతృభూమి పిలుపు. మాతృభూమి భవితవ్యం, మీ కుటుంబ భవిష్యత్తు, మీ పిల్లల భావి, అంతా మీచేతులలో వుంది."

యుద్ధం ప్రారంభమయి మూడేండ్లు దాటింది. ఈ సంవత్సరం యెదురు దాడులు సాగించే ప్రయత్నంలో వుండాలని బ్రిటిషు పత్రికలన్నీ వ్రాస్తున్నాయి. కాని సంవత్సరానికి పైగా రష్యా ఒంటరిగా నాజీ ధాటిని యెదుర్కోవలసి వస్తుంది, అయినా యింకా రెండవరంగం తెరవలేదు. లండన్‌లో జరిగిన అంతర్జాతీయ యువజన మహా సమావేశానికి (Rally) సందేశం పంపుతూ, సోవియటు రాయబారి మెయిస్కీ యిలా అన్నాడు. "ఇంతవరకూ నాజీ జర్మనీకి వ్యతిరేక పోరాటపు భారమంతా రష్యా భరించింది. మన మిత్రులుకూడా త్వరలోనే సమానంగా ఆ భారాన్ని పంచుకొంటారని ఆశించుతున్నాను."

రూజ్‌వెల్టు దూతగా రష్యా, చైనాల సందర్శింపనున్న విండెల్‌వెల్కీ ఈజిప్టులో ప్రసంగించుతూ యిలా అన్నాడు.

యుద్ధ సమీక్ష

"అమెరికా ప్రజలు రెండవ రంగం తెరవాలని కోరుతున్నారు. కాని యీ విషయం మిలిటరీ ప్రముఖులు నిర్ణయించవలసిన టెక్నికల్ విషయం."

ఈవిధంగా ఇంకా, మిత్రరాజ్యాల పరిపాలక వర్గంలో సంకోచం కల్పించుతుంది. జనరల్ సికోర్స్కి కూడ యుద్ధం మరొకసంవత్సరం కొనసాగుతుంది అనడం కూడా ఇదే తెలియజేస్తుంది. అయితే రెండవ రంగానికై ప్రపంచప్రజల ఒత్తిడి ఎక్కువవుతూనే వుంది. బ్రిటిష్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు సమావేశంలో ఈ సమస్య ప్రధాన సమస్యగా చర్చింపబడి యుంటుంది. (ఈ చర్చలు గురించి యింకా పూర్తి వార్తలు రాలేదు)

ఈ మధ్యనే నిషేధం తొలగించబడిన బ్రిటిషు కమ్యూనిస్టు దిన పత్రిక "డైలీ వర్కర్" సంపాదకవర్గం, రెండవ రంగం యూరప్‌లో తక్షణం యేర్పరచడానికిగాను నిరంతర ఆందోళన చేస్తామని ప్రకటించారు.

జర్మను వైమానిక శక్తిని తమ దేశంలో విపరీతంగా నాశనం చేస్తోంది సోవియటు యూనియన్. గత నెలలో 1788 జర్మన్ విమానాలను నాశనం చేసింది. ఇంతేగాక జర్మనీపైన ఆక్రమిత దేశాలపైన, అక్షరాజ్య అనుచర దేశాలపైన సోవియటు విమానాలు బాంబులు వేస్తున్నాయి. వార్సా, బుడాపెస్టు, కొయినిగ్స్‌బర్గులపై దాడి సాగించింది. ఇంతేగాక రాయల్ విమాన దళాలుకూడ బ్రెమెన్, కోల్‌స్రుహీ మొదలగు పట్టణాలపై బాంబులు వేశాయి.

ఈ విమాన దాడులు జర్మనీ పారిశ్రామిక సంపదలను రాకపోకలను విచ్ఛిన్నపర్చడానికి ఉపయోగించడమే గాక జర్మను ప్రజలలో నైతికంగా అపజయ భీతిని హెచ్చిస్తాయి. తిరుగుబాటు తత్వాన్ని ఆక్రమిత దేశాలలో హెచ్చిస్తాయి. అందుకనే మైస్కీ (సోవియటు రాయబారి) యిలా అన్నాడు,

"నాజీ జర్మనీని బాంబు జేయండి. రాత్రింబవళ్లు బాంబు చేయండి, నాజీ జర్మనిలో తూర్పు పడమటలలో, ఉత్తర దక్షిణాలలో, ప్రతిచోటా బాంబు చేయండి. నిరంతరం తీవ్రముగా బాంబు చేయండి. ఇది చాల అతిముఖ్యమైన కర్తవ్యం."

1918 నవంబరులో వలెనే ఇపుడుకూడ జర్మను పరిస్థితులు అధ్వాన్నంగా వున్నాయని వ్రాసిన ఒక స్విస్ పత్రిక అణచి వేయబడింది. హిట్లర్ ఒక అగ్ని పర్వతంమీద కూర్చున్నమాట నిజమే. అశాంతి అన్నిచోట్లా వున్నమాట నిజమే. కాని హిట్లరు ప్రభుత్వం దానంతటది కూలిపోదు. దానికి ప్రయత్నం చేయాలి. విప్లవాలకు దోహద మివ్వాలి. అందుకు తగినది రెండవ రంగమే.

ఈమధ్య ప్రారంభమైన జనరల్‌రోమెల్ దాడి తీవ్ర రూపం దాల్చలేదు. రోమెల్ తాత్కాలికంగా ఆగినట్లే. ఈజిప్టుకు ప్రమాదం తప్పినదని, వెండెల్‌విల్కి అంటున్నాడు. అయినా, ఇంతటితోనే అక్షరాజ్యాలు తమ దాడిని ఈరంగంలో మానివేస్తవని మన మనుకొనరాదు.

పసిఫిక్ యుద్ధవర్గంలో, జపాన్, జర్మనీలు చేతులు కలపడాన్ని (అంటే రెండూ అక్రమించుకుంటూ వచ్చి ఏదో ఒక ప్రదేశంలో కలవడం) గురించి చర్చించారు. ఈజిప్టు, కాస్పియన్ సముద్రం, ఇరాక్ ఇరాన్‌లమీదుగా నాజీల దుష్టఛాయ పడుతోంది. సోవియట్ తన రక్తాన్ని ధారవోసి మనపైవచ్చే దాడిని అచట అరికడుతోంది.

మరోప్రక్క చైనా, జపాను దుండగీండ్రను తరిమి వేస్తోంది. ఈవారం మరికొన్ని విజయాలను సంపాదించింది. చెకియాంగ్‌రాష్ట్ర ముఖ్యపట్టణమైన క్విన్హ్వాను ముట్టడించాయి చైనాసైన్యాలు. కాంటన్‌కు 16 మైళ్ల వాయువ్యంగా నున్న ల్యూపాల్‌నుగూడ చైనా ఆక్రమించింది.

ఇటు చైనాలోనే గాక, దక్షిణపసిఫిక్‌లో గూడ జపాను దెబ్బతింటుంది. చైనానుండి కదలిన సైన్యాలు కొన్ని సింగపూరువైపుకు కదిలాయి.

జపానులో టోగో రాజీనామా, రష్యాపై దాడికే నని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. పసిఫిక్ యుద్ధవర్గ సభ్యులొకరు రష్యాపై దాడి త్వరలో తప్పదని అన్నారని హిందూ ప్రత్యేక విలేఖరి తెలియజేస్తున్నాడు. అయితే ఈపసిఫిక్ యుద్ధవర్గం సమావేశంలోనే యిండియాపై జపాను దాడినికూడ ఆలోచించారు. చైనా పసిఫిక్‌లలో దెబ్బలు తినే జపానుకు, యిండియా యిప్పటి పరిస్థితులలో జయించడానికి సులభం.

అందుచే ప్రస్తుత ప్రతిష్ఠంభన, అరాచకం తొలగించి, జపాను నెదుర్కొన సిద్ధం గావాలంటే జాతీయైక్యత ఒక్కటే మార్గం. మరొకమార్గం లేదు. (8-9-42)

ప్రజాశక్తి

9-9-42 బుధవారం

ఆహారపదార్థాల సమస్య : ప్రభుత్వ కర్తవ్యం

ఆరవడానికి భారతదేశం సస్యశ్యామలమే. కాని ఏమిలాభం? ప్రజలకుమాత్రం తిండిలేదు. అందులోనూ యుద్ధం వచ్చినతరువాత ఆహార పదార్థాల కొరత మరీ ఎక్కువైంది. ఈమధ్య వెలువడిన ప్రభుత్వప్రకటనలే దీనిని రుజువు చేస్తున్నాయి. ఈనెల 4 వ తేదీని మద్రాసు ప్రభుత్వం మన రాష్ట్రంలో బియ్యం, జొన్న, గోధుమ, పంచదార మొదలైన ముఖ్య ఆహారపదార్థాలు చాల కొరతగా వున్నాయని ప్రకటించింది. ఆతేదీనే బొంబాయి ప్రభుత్వంకూడ ఇట్టి ప్రకటననే చేసింది. అగస్టు 24 వ తేదీని కేంద్రీ. ఆహార సలహాసంఘ (Central Food Advisory Council) సమావేశాన్ని ప్రారంభించుతూ కేంద్రప్రభుత్వ విద్యా, ఆరోగ్య, వ్యవసాయ శాఖా సభ్యుడైన సర్. జోగేంద్రసింగ్ తన ఉపన్యాసంలో కొన్ని అమూల్యమైన విషయాలు బయటపెట్టాడు. నేడు మన దేశంలో సేద్యానికి అనుకూలమైన భూమి 10 కోట్ల 50 లక్షల యకరాలుంది. అదిగాక ప త్తి, జనపనార మొదలైన వ్యాపారపంటలు పండించే భూమిని ఆహారపదార్థాలు పండించేదిగా మార్చవచ్చు. అట్టి భూమిలో ప్రభుత్వం ఇంతవరకు 50 లక్షల యకరాలు మాత్రమే సాగుకు తెచ్చింది. బర్మా పతనం మూలాన మనదేశానికి వచ్చే 22 లక్షల టన్నుల బియ్యం దిగుమతి ఆగిపోయింది. ఇప్పుడు ప్రభుత్వపు 1943—44 సం॥ బడ్జట్టులో ఆహారపదార్థాల అదనపు ఉత్పత్తి అంచనా ప్రకారం 8½ లక్షల టన్నుల బియ్యం మాత్రమే అదనంగా పండించబడతాయి.

అయితే యీ కొరతను తీర్చడానికి, కరువును నివారించడానికి, ప్రభుత్వం యేమి చేస్తోంది? ఏవో కొన్ని ప్రకటనలు, ప్రజలకు హెచ్చరికలు మాత్రం చేస్తోంది. అంతటితో తన కర్తవ్యం పూర్తి అయినట్లు భావించుతోంది. ప్రకటనలకు పనులు జరిగితే హిట్లర్ని యేనాడో ఓడించి వుండేవారం. ఈ నిరంకుశ సామ్రాజ్యవాద ప్రభుత్వ యంత్రంలో ప్రభువును మించిన పడితొత్తులు, స్థానికాధికారులు యధాప్రకారంగానే వుండేటప్పుడు యిక ప్రకటనల నమలు జరిపేవారెవరు? ప్రజలు ప్రభుత్వంపై ఒత్తిడి తేవచ్చు నిజమే. కాని. అన్నమడిగిన ప్రజలకు లాఠీ దెబ్బలు, తుపాకి గుండ్లు బహూకరించే స్థానికాధికారు లున్నప్పుడు, ప్రభుత్వ ప్రకటనలు అమలు జరగడం లేదని తెలిపే ప్రజల మహజర్లు, ఆందోళన గమనించని ప్రభుత్వమైనప్పుడు వారేమి చేయగలరు? దీనికి లక్ష ఉదాహరణ లివ్వవచ్చు. బొంబాయిలో ప్రభుత్వం యేర్పరచిన షాపులో ఆహార పదార్థాలు కొనుక్కోడానికి వెళ్ళిన ప్రజలపై యీ నెల 4 వ తేదీని పోలీసులు తుపాకులు కాల్చారు. అక్కడ ప్రభుత్వం యేదో మొక్కు తీర్చుకోడానికి కొద్ది స్టాకు మాత్రమే పెట్టింది. ప్రజల కది చాలలేదు. ఇంకా కావాలని కోరారు. అది స్థానికాధికారుల దృష్టిలో సహించరాని చర్య అయింది. మొన్న గుంటూరులోకూడ చౌక ధరల డిపోవద్ద ప్రజలు గుమిగూడినప్పుడు 144 సెక్షను వంకబెట్టి పోలీసులు వారిపై దౌర్జన్యము చేయబోయారు. స్థానిక కమ్యూనిష్టులు ప్రజలకు నచ్చచెప్పి అల్లరి జరుగకుండా శాంతియుతంగా సాగనంపవలసి వచ్చింది. ప్రభుత్వం పోరంబోకులనే గాక, "కొన్ని తావులలో ప్రైవేటు భూస్వాములు బంజరుగా వుంచిన భూమినికూడ పంటల అభివృద్ధికోసం ప్రభుత్వమే తీసుకొని సరసమైన శిస్తును ఆ భూస్వామికిచ్చేటట్లు ఆ భూములను యితర రైతులకు కౌలుకు యివ్వవచ్చునని. అట్టి కౌలుకోసం రెవిన్యూ వుద్యోగులకు దరఖాస్తు పెట్టుకోవాలని" మద్రాసు ప్రభుత్వం ప్రకటించినది. ఈ ప్రకటన క్రిందికి వచ్చే భూమి జమీందారి యేరియాలో కావలసినంత వుంది. మన రివిన్యూ అధికారులు ఆ ప్రకటనను అమలు జరపడంలేదు సరిగదా, చల్లపల్లివంటి యెస్టేట్లలో బంజరు భూమిని సాగు చేసుకొంటామని కోరిన బీద రైతులను కొట్టి, గుర్రాలచే తొక్కించి, కొంపలు తగులబెట్టి, కేసులు పెడుతున్నారు. రైల్వే పోరంబోకులుకూడ సాగుకు యివ్వాలని ప్రభుత్వ ప్రకటన. రైల్వే ఉద్యోగులు దానిని సరిగా అమలు జరుపడం లేదు. ఉదాహరణకు: కృష్ణాజిల్లా గన్నవరం తాలూకాలో రైల్వే పోరంబోకులు సాగుకు యిచ్చారు. ఆ భూమి సాగుకూడ చేయబడింది. కాని 2 నెలల క్రితమే అర్జీలు పెట్టుకొని మొరపెట్టుతున్న గుడివాడ తాలూకాలో యింతవరకు అంగీకరించలేదు. ఇక ప్రభుత్వ బంజరు భూములను సాగుకివ్వాలనే ప్రభుత్వ ప్రకటనకూడ యెంత చక్కగా అమలు జరుగుతోందో చూడండి. ప్రభుత్వ ప్రకటన వెలువడినది మొదలు పశ్చిమ గోదావరి జిల్లాలో పేద రైతులు, వ్యవసాయ కూలీలు ఆందోళన చేస్తూనే వున్నారు. మహజర్లపై మహజర్లు, డిప్యుటేషన్లపై డిప్యుటేషన్లు పంపుతూనే వున్నారు. చివరకు భూములు మాత్రం పెద్ద పెద్ద భూస్వాములకే యివ్వబడ్డాయి. దేవుడు వరమిచ్చినా ఆ పూజారులు వరమివ్వలేదు. పెద్ద పెద్ద భూస్వాములకు యీ బంజరు భూములను యివ్వడంవల్ల ప్రభుత్వ ఆశయం ఎంతవరకు నెరవేరుతుంది? ఏమీ నెరవేరదు. ఎందుకంటే ఆ పెద్ద భూస్వామి యీ భూమిని శ్రద్ధగా సాగుచేసి యెక్కువ ఆహార దినుసులు పండించాలని కోరడు. దానిని తిరిగి రైతులకు మగతాకు యిస్తాడు. తనకు దానిపై లాభం రాబట్టుకోవాలని మాత్రమే చూస్తాడు.

బంజరుభూములను సాగుకు ఇచ్చినంత మాత్రంతో నేటి ఆహారసమస్య తీరదు. ఈ కొత్తపంట ప్రజలచేతికి వచ్చేటంతవరకు ప్రజలకు ఆహారసప్లయి విషయం చూడవలసిన బాధ్యత ప్రభుత్వంపై వుంది. బంజరుభూములను సాగుకు తెచ్చుటలో చేస్తున్నట్లే, ధరలకంట్రోలు విషయంలోకూడ స్థానికాధికారులు ప్రభుత్వ ప్రకటనలను అమలు జరపకుండా భగ్నం చేస్తున్నారు. దోపిడులు జరిగినచోట్ల మాత్రం ప్రభుత్వషాపులు పెట్టారు. అక్కడైనా సరిపడ్డ స్టాకు వుంచడంలేదు. అధికలాభాలకు అమ్మే వర్తకులపై చర్యలు జరపడంలేదు. ఉదాహరణకు బెజవాడలో ఒకటిన్నర సంవత్సరాలనుండి జరిగే ఆందోళనను స్థానికాధికారులు తుడిచి పారవేస్తున్నారు. అందుచే ఈ విచ్ఛిన్నకర్వరులకు వదలిపెడితే ఏమీ జరుగదు. ఈమధ్య జరిగిన అల్లరులలో సరఫరామార్గాలు పాడుచేయడంవల్ల ఆహార పదార్థాల సప్లయి ఆగిపోయిందని బెదరింపు ప్రకటనలవల్ల కూడా ప్రయోజనం వుండదు. సరఫరా మార్గాలు పాడుకావడంవల్ల సప్లయిలు ఆగిపోయేమాట నిజమే. కాని ఆ దుస్థితికి కారకులెవరు? ప్రభుత్వమే. ప్రభుత్వమే ప్రజలను రెచ్చగొట్టింది. ప్రజలు తాత్కాలిక ఆవేశానికి ఎరవై పిచ్చి పనులు చేశారు. ప్రభుత్వం ఇప్పుడా నెపం ప్రజలపై రుద్దుతోంది. దీనివలన ప్రయోజనం లేదు. ప్రస్తుతకర్తవ్యం ఆలోచించాలి. ఆ బాధ్యత ప్రభుత్వంపైనేవుంది. అందుచేత ప్రభుత్వం వెంటనే ఈ క్రింది పనులు గావించాలి.

దేశంలోనున్న ఆహారపదార్థాల నన్నిటిని పోగుచేసి ప్రభుత్వడిపోలు పెట్టి చౌకధరలకు ప్రజలకు సప్లయి చెయ్యాలి.

ప్రజల కొనుగోలు శక్తిని యెక్కువ చేయడానికి యుద్ధ అలవెన్సులు ఒక్క ప్రభుత్వోద్యోగులకే గాక, అన్ని లోకల్ బోర్డులలోను, రైల్వేలలోను అమలు జరిగేటట్లు చేయాలి.

బంజరు భూమి నంతనూ, జమీందారీ ప్రాంతాలలోని భూమితోసహా, సాగుకు తెచ్చి పైన చెప్పిన ఆహార కొరత రాకుండా, యిప్పటినుంచీ జాగ్రత పడాలి.

ఈ పనులు కేవలం స్థానికాధికారులకే వదలిపెడితే లాభంలేదు. వారు తమ కర్తవ్యాన్ని సరిగా నెరవేర్చేటట్లు వారిపై నిఘా పెట్టాలి.

ప్రశ్న :

కామ్రేడ్ కళ్యాణక్రిష్ణన్

ఒక కాంగ్రెస్‌వాదియిలా ప్రశ్నిస్తున్నాడు. ప్రజాయుద్ధ పాలసీమూలంగా, మీరు మా పోరాటంలో సహకారం చేయజాలరని మాకు తెలుసు. మీరు రష్యాఅంటే పడిచస్తారని మాకు తెలుసు. మీరు తటస్థంగా వుండి, కాంగ్రెసును జనరల్ స్ట్రైయిక్ (సార్వజనీన సమ్మె)ను ఎందుకు సంఘటిత పరచుకోనీయరాదు?"

సమాధానం :

కమ్యూనిస్టుల ప్రజా యుద్ధపాలసీ ఒక "మంత్రమని" రష్యాకు సహాయం చేయడానికి జపిస్తూవుంటామని, ఈ దేశభక్తుని వూహ. కాని వాస్తవం అదికాదు. మన దేశాన్ని మన ప్రజలను, ఒక ప్రక్క బ్రిటిషు నిరంకుశాధికారులనుండి, మరో ప్రక్క జపాను దండ యాత్రికుల నుండి, మాప్రజా యుద్ధపాలసీ ఒక్కటియే రక్షించగలదు. మావాదన ఇది: బ్రిటిషు ప్రభుత్వం యొక్క యుద్ధ ప్రయత్నాలను వ్యతిరేకించడం అంటే, జపానువాళ్లు మనదేశాన్ని ఆక్రమించి మన ప్రజలను బానిసలుగా జేయడంలో, సహాయపడటం అన్నమాట. ఇలా చేయడంవలన బ్రిటిషు వాళ్ల నాశనమయితే గావచ్చు. కాని మన ప్రజల కొంపకూల్చి మరీ నాశనమవుతారు. జపాను వాళ్ళను మన నెత్తికెక్కించి మరీ నాశనమవుతారు. యుద్ధప్రయత్నాలయెడ తటస్థంగా వుండడం అంటే, అసమర్థులైన విదేశ నిరంకుశాధికారుల చేతులలో, మన ప్రజారక్షణను వదలివేయడం అన్నమాట. అంటే మలయా లాగా, బ్రిటిషువాళ్ళ చేతులలోనుండి జపాను వాళ్ళ చేతులలో పడటం అన్నమాట. అన్ని రకాల శత్రువులనుండి మన స్వాతంత్ర్యాన్ని మనం లాక్కోడానికి ఒకేమార్గం యుద్ధప్రయత్నాలలో జోక్యం కలుగజేసుకొని, యుద్ధాన్ని తమ చేతులలోకి లాక్కొనేటట్లు ప్రజలను సంఘటితపరచడమే. మనప్రజలు తమ స్వాతంత్ర్యాన్ని ఈ యుద్ధం ద్వారా సంపాదించుకోగలరు. కాబట్టి ఇది ప్రజాయుద్ధం. ఈ యుద్ధానికి దూరమైపోతే, మనం ఫాసిస్టు దాస్యానికి గురిఅవుతాం.

ఈనాడు జనరల్ స్ట్రయిక్‌లను వ్యతిరేకించుతున్నాం. ఎందువలన? ఉత్పత్తిలో జనరల్ స్ట్రయిక్ చేయడంవలన, మనకు జాతీయప్రభుత్వంరాదు సరిగదా, జపాను దండయాత్రికులకు వ్యతిరేకంగా జరిపే జాతీయ రక్షణకార్యాలను స్తంభింపజేస్తుంది - బ్రిటిషు వాళ్లకు బదులుగా జపాను యజమానులను తెచ్చిపెడుతుంది.

అన్నిరకాలయజమానుల పీడావదల్చుకొని మనం స్వతంత్రం పొందాలి. కాని దీనివలన మనం పొందేది స్వతంత్రంకాదు బ్రిటిషు వాళ్లకు బదులుగా జపాను యజమానులను పొందుతాం - నేడు ఉత్పత్తిలో జనరల్ స్ట్రయిక్ చేయడం అంటే అర్థం ఇది.

అట్టి పరిస్థితులలో, మనం ఎలాతటస్థంగా వుండగలం? తప్పుడు దోవపట్టిన దేశభక్తి ప్రవాహంలో కొట్టుకుపోయి చేసిన చర్యల యెడ మేము తటస్థత వహించ లేము. అట్టి చర్యలు వాస్తవంలో జపాను దండయాత్రికులకు సహాయ పడుతున్నపుడు, మేము ఎలా తటస్థంగా వుండగలం?

"ప్రస్తుతపోరాటం తాత్కాలికంగా, రష్యాకు నష్టం కల్గించవచ్చు కాని చివరకు హిందూ దేశస్వాతంత్ర్యానికి సహాయంచేస్తుంది. అందుచేత కమ్యూనిస్టులైన మీరు ఎందుకు తటస్థంగావుండరాదు?" (మిగతా 9 వ పేజీలో)

హిందూ లా సవరణ: భారత మహిళల కర్తవ్యం

కామ్రేడ్ కె. చలపతిరావు, బి.ఏ., బి.టి.

ప్రస్తుతం అమలులోనున్న హిందూ ధర్మశాస్త్రం చాల లోపభూయిష్టమై యున్నదని, దానిని సంస్కరించాలని చాల కాలం నుండి ఆందోళన జరుగుతోంది. కాని ప్రభుత్వం దానిని సమూలంగా మార్చకుండా, ప్రజాఒత్తిడి యెక్కువైనపుడెల్ల ఇక్కడ కొంత భాగం, అక్కడ కొంతభాగం మార్చుతూ వచ్చి, చివరకు హిందూ ధర్మ శాస్త్రాన్ని ఒక అతుకుల బొంతగా తయారు చేసింది. తత్ఫలితంగా అది పరస్పర వైరుధ్యాలతో నిండి నిబిడీకృతమై వుంది. ఈ బూజుపట్టిన ప్రాచీన ధర్మశాస్త్రం వల్ల హైందవ స్త్రీలు హెచ్చు కష్టాలకు గురికావలసి వచ్చింది. స్త్రీని బానిస కూపంలో బడదోసి పైకి రాకుండ నేటి ధర్మశాస్త్రం చూస్తూ వుంది. స్వాతంత్ర్య ప్రజాస్వామిక హక్కుల కొరకు యెల్లెడల ఆందోళన జరుగుతున్న ఈ రోజుల్లో విజ్ఞానవతు లగుచున్న భారత మహిళలు గూడ కండ్లు తెరిచారు. తమ దుస్థితిని గమనించారు. తమ అభ్యుదయానికి అంతరాయంగా నున్న న్యాయ శాస్త్రాన్ని సంస్కరించాలని ఆందోళన గావించ సాగారు.

రెండు సంవత్సరాల క్రితమే కేంద్రశాసన సభలో జి. వి. దేశ్‌ముఖ్ హిందూ వితంతువులకు భర్త ఆస్తిపై హక్కు వుండాలనీ, సుబ్బరాయన్ సతి బహు భార్యాత్వమును నిషేధించాలనీ, అఖిలచంద్ర దత్తు హిందూ స్త్రీలకు విడాకుల హక్కుండాలనీ మూడు బిల్లులు ప్రవేశపెట్టారు. అంత ప్రభుత్వం 1941 జనవరిలో వీటన్నిటిని గూర్చి విచారించుటకు బి. యన్. రావు కమిటీని నియమించినది. హిందూ లా అంతా లోప భూయిష్టంగా నున్నదిగాన, చిన్నచిన్న సవరణలవల్ల ప్రయోజనం లేదనియు, అంతా తిరిగి వ్రాయవలసి (Recordify) యున్నదనియు, తమ నివేదికలో వారు వ్రాసిరి. అంత వారు ప్రభుత్వం అనుమతిపై మొదట వారసత్వ వివాహ చట్టములను తిరిగి వ్రాసి, 1942 మే లో వానిని బిల్లులుగా ప్రకటించిరి. ఇంకను తిరిగి వ్రాయ (Recordify) వలసినభాగాలు ఉన్నవి. అవి కూడ తయారు అయిన తరువాత మొత్తంగా అన్నిటిని 1946 జనవరి 1వ తేదీనుండి అమలు పెట్టదలచినట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. ఏదో యొక నెపంమీద ప్రభుత్వం కాలహరణ మొనర్చి ఇవి త్వరలో అమలులోనికి రాకుండ ఉద్దేశ్యమున్నట్లు గోచరమగుతోంది.

ప్రస్తుతం వెలువడిన వివాహ వారసత్వ బిల్లులు యెంతవరకు అభివృద్ధిదాయకములో విమర్శించి మహిళల అభ్యుదయానికి అంతరాయము గల్పించు భాగాలను సవరణ జేయ సక్రమాందోళన గావించాలి.

వారసత్వ చట్టము

హిందూధర్మశాస్త్రం స్త్రీకి ఆస్తిహక్కును గుర్తించలేదు. "స్త్రీ ధనము" మీద మినహా మరి యెట్టి ఆస్తిపైన ఆమెకు హక్కులేదు. ఈ నూత్నచట్టము స్త్రీ ఆర్థికసమస్యను కొంతవరకు పరిష్కరించినను; సంపూర్ణంగా పరిష్కరించలేదు. స్త్రీ పురుష వివక్షత చూపి, స్త్రీలకు జరుగుచున్న అన్యాయాలను సంపూర్తిగా తొలగించలేదు. సమీప బంధుత్వాన్ని బట్టి వారసత్వహక్కు నిర్ణయించాలి. స్త్రీ పురుష భేదాన్ని యేమాత్రం పాటించగూడదు అనే సూత్రం నూత్నచట్టంలో అవలంభించబడలేదు. యీ ప్రధాన లోపాన్ని సవరణజేస్తే స్త్రీల ఆర్థికసమస్య చాలవరకు పరిష్కారమగుననుటలో సందేహంలేదు.

ఇట్టి ప్రధానలోప మున్నప్పటికి స్త్రీల యభివృద్ధికి ఉపయోగపడు మార్పులు కొన్ని గొని రాబడినాయి.

అభివృద్ధికరమైన మార్పులు

(i) ఈచట్టం స్త్రీకికొంత ఆస్తి హక్కును గుర్తించినది. ఆ యాస్తిపై ఆమె సంపూర్ణాధికారం కలిగియుంటుంది. ఒక వ్యక్తి చనిపోయినప్పుడు, ఆస్తిలో అతని భార్యకు (లేక భార్యలకు) ఒక భాగము, పుత్రుని కొక్కొక్కనికి ఒక భాగము, పుత్రిక కొక్కొక్కరికి అర్థభాగము సంక్రమించును. బిడ్డలు కూడ లేనపుడు ఆమెకే ఆస్తిపై సర్వాధికారము లభించును.

(ii) ఒక వ్యక్తి మరణించినపు డతనికి భార్యగాని, బిడ్డలుగాని, మనుమలుగాని, మనుమరాండ్రుగాని లేని యెడల తల్లియే ప్రథమ వారసురాలుగా నూత్న చట్టం గుర్తిస్తోంది.

(iii) పైన పేర్కొనబడిన వారెవ్వరూ గాని సోదరీ సోదరులుగాని, వారి తాలూకు సంతానం గాని లేని యెడల తండ్రి తల్లి ప్రథమ వారసురాలు.

లోపాలు

(i) ఈ చట్టం స్త్రీ పురుష సమానత్వాన్ని అంగీకరించలేదు. తండ్రి ఆస్తి పంపకంలో పుత్రునియెడ ఆధిక్యత కనబరచింది. ఈఅన్యాయం కుమార్తెకు, కుమారునితోబాటు సమాన వాటా రావాలి.

(ii) వారసత్వ హక్కులో సోదరుని సోదరీని సమానంగా భావించాలి. యీ చట్టం సోదరునికి ఆధిక్యత(Preference)నిస్తోంది. సోదరుడుగాని, అతని కుమారులుగాని, అతని కుమారులుగాని లేకపోయినచో అతని సోదరి వారసురాలుగా మాత్రమే గుర్తించబడింది.

(iii) మేనత్తకు వారసత్వ హక్కును నిరాకరించబడింది. తండ్రి సోదరులతోపాటు తండ్రి అక్క చెల్లెండ్రికుకూడ సమాన వారసత్వ హక్కు నొసంగాలి.

(iv) భర్త జీవించియుండగా భార్య అవినీతికరమగు ప్రవర్తన గలిగియున్న యెడల (క్షమించిననే తప్ప) ఆమె భర్త ఆస్తిపై వారసత్వ హక్కును కోల్పోవును. ప్రవర్తనతో నిమిత్తం లేకుండా ఆమెకు హక్కునివ్వాలి.

(v) వితంతువు వివాహము చేసికొన్నను భర్తనుండి సంక్రమించిన ఆస్తి కోల్పోకుండ రక్షణ నేర్పాటు చేయాలి.

వివాహ చట్టము

స్త్రీ బానిసత్వానికి మూలకారణం ఆర్థిక అస్వతంత్రతయే. హిందూ సమాజములో నేడున్న వివాహ పద్ధతులు ఆ బానిసత్వాన్ని శాశ్వతంగాఉంచుటకే ఉపయోగపడుతున్నాయి. భర్తను కోరుకొనుటలో స్త్రీకి స్వేచ్ఛ లేదు. ఆమెపై తలి దండ్రుల నిరంకుశాధికారాన్ని చట్టం బలపరుస్తోంది. వివాహమంటే యేమో తెలియని చిన్నవయస్సులోనే వివాహ నిర్బంధాన్ని ఆమెపై ప్రయోగిస్తారు. హిందూ న్యాయశాస్త్ర ప్రకారం ఒకసారి వివాహమైన పిమ్మట వివాహ బంధాలు శాశ్వతంగా నిల్చి ఉంటాయి. స్త్రీకి ఒకేపర్యాయం వివాహం చేసుకొను హక్కును మాత్రం హిందూ ధర్మ శాస్త్రం అంగీకరిస్తుంది. పురుషు డెందరి భార్యలనైన కలిగి యుండవచ్చును. ఇటీవల చట్టం వితంతు వివాహాన్ని అంగీకరించినా ఆమె ఆర్థికస్థితిలో యేమాత్రం మార్పు కాన్పించలేదు.

వివాహం ఐచ్ఛికంగాను, స్వేచ్ఛగాను జరుగనప్పుడు దాంపత్యసుఖం ఉండదు. ఈ నూతన వివాహచట్టంకూడ స్త్రీ పురుష భేదాన్ని పాటించింది. భర్తను కోరుకొనుటలో స్త్రీ స్వాతంత్ర్యమును గుర్తించలేదు. వివాహ పద్ధతులలోకూడ చెప్పుకోదగిన మార్పులేమీ గొనిరాలేదు.

ఈచట్టం హిందువులకు రెండు వివాహ పద్ధతులను అంగీకరించింది.

1. సంస్కార వివాహ పద్ధతి (అగ్ని సాక్షిగా ప్రాచీన సాంప్రదాయానుసారం)

2. రిజిష్టరు వివాహ వద్ధతి (Civil marriage). ఈ పద్ధతిని వివాహం చేసికొన్నవారికి ప్రస్తుతం అమలులోనున్న విడాకుల చట్టం (Indian Divorce Act) వర్తిస్తుంది.

అభివృద్ధికర మార్పులు

(1) ప్రాచీన కాలంనుండి హిందువులలో యెందరి స్త్రీలనైన వివాహం చేసికొను ఆచారమున్నది. నూతన చట్టం బహు భార్యత్వాన్ని నిషేధిస్తోంది. అనగా ఒక పురుషుడు ఒకే కాలంలో ఒక భార్యకన్న యెక్కువ కలిగి యుండరాదు.

(2) రిజిస్టర్డు వివాహపద్ధతిని (Civil Marriage) నూత్నచట్టం సమ్మతించింది. ఈ పద్ధతిని పెండ్లిచేసికొంటే హిందూ న్యాయశాస్త్రమునుండి పొందు లాభాలను కోల్పోనవసరంలేదు. అనగా నేడున్న ప్రతిబంధకాలు తొలగించబడ్డాయి.

(3) వివాహసందర్భంలో తండ్రి తర్వాత తల్లియే సంరక్షకురాలుగా ఉండుహక్కు యీ నూత్నచట్టం అంగీకరించింది.

లోపాలు

(1) వివాహవయస్సు: స్త్రీకి 14 సంవత్సరములు. పురుషునికి 18 సంవత్సరములు కనీస వయస్సుగా చట్టము నిర్ణయించెను. తలిదండ్రుల అభీష్టానికి వ్యతిరేకంగా స్త్రీ వివాహమాడవలెనంటే, సంస్కారపద్ధతినైతే 16; రిజిస్టర్డు వివాహవద్ధతి నైతే 21 సంవత్సరములు నిండియుండవలెను. ఈ హద్దులు భర్తను కోరుకొనుటలో స్త్రీ స్వాతంత్ర్యమునకు అడ్డుతగులుచున్నవి. స్వతంత్రించి రిజిస్టర్డు పెండ్లిచేసుకోవాలంటే 21 సంవత్సరాలు నిండేవరకు ఉండాలి. హిందూ కుటుంబాలలో ఇంతకాలం వివాహం జరుగకుండా వుండదు. 21 యేండ్లలోపు అయితే తప్పనిసరిగా సంస్కార పద్ధతిని వివాహం చేసుకోవలసి వస్తుందన్నమాట. అనగా దురదృష్టవశాత్తు భర్త మోనగిస్తే, స్త్రీ తన వివాహమును రుజువుపర్చుకొనుటకు తప్పనిసరిగా పౌరోహితునిమీద ఆధారపడు దుర్గతి పడుతుంది. అందుచే (Civil Marriage) కి కూడ కనీసవయస్సు 16 సంవత్సరాలుగా మార్పుచేయాలి.

(2) వివాహాలన్నీ తప్పక రిజిష్టరు చేయించుకొనవలెనను నియమాన్ని పెట్టాలి. దీనివలన వివాహం అయినట్లు వేరే రుజువు కొరకు శ్రమపడ నవసరం లేదు. రిజిష్టరు చేయించుకొన్న పిమ్మట యెవరి ఆచారప్రకారం వారు వివాహం జరుపుకోవచ్చు.

(3) ఇప్పటి విడాకులచట్టాన్ని అనుసరించి పురుషుడు భార్యను వదిలివేయాలంటే ఆమె వ్యభిచారిణి అని రుజువుచేస్తే చాలు. కాని స్త్రీకి పురుషుడు వ్యభిచారి అని రుజువు చేసినంతమాత్రాన సరిపోదు. అతడు తనయెడ క్రూరంగా ప్రవర్తిస్తున్నాడని, అతనివలనంటే తనకు ప్రాణమోసం జరుగుతుందని, రుజువు చేసుకోగలిగితేనే విడాకులు పొందగలుగుతుంది. ఇద్దరికీ ఒకే షరతులు అనువర్తింపజేసి ఈ అన్యాయాన్ని తొలగించాలి.

(4) "సపిండ వివాహాలు" (పురుషుని నుండి 7 తరాలు, స్త్రీనుండి 5 తరాలు వరకు) నిషేధించినప్పటికీ ఆచారం ఉన్న చోట్ల అమమతిస్తోంది. ఆంధ్రదేశంలో హిందూ కుటుంబాలలో మేనమామ కూతుర్ని లేక మేనత్త కూతుర్ని లేక మేనగోడలను చేసుకొనే ఆచారం విస్తారంగా ఉన్నది. ఆధునిక శాస్త్రజ్ఞులు (Engenists) యిట్టి వివాహాలు జాతి, భౌతిక, మానసిక అభివృద్ధికి హానియని రుజువు చేసియున్నారు. అందుచే జాతి అభ్యుదయం కొరకు యీ చట్టం భాగాన్ని యెట్టి మినహాయింపులు లేకుండ ఆచరణలో పెట్టాలి.

(5) సంస్కార వివాహానికి వేరొక విడాకుల చట్టం అనవసరం. ప్రస్తుతం అమలులోనున్న ఇండియన్ డైవర్స్ ఆక్టును (పైన సూచించిన సవరణ గావించి) వర్తింపజేయవచ్చును.

ముగింపు

భారతస్త్రీలు పాశ్చాత్య స్త్రీలతో పోల్చి చూస్తే అన్ని విధాల యెంతో వెనుకబడి యున్నది. వారు అభివృద్ధి గాంచనన్నాళ్ళు జాతి ముందుకుపోనేరదు. అందుచేతను హక్కులకొరకు సంఘటితంగా పోరాడాలి. నూతన చట్టంలో అవసరమైన సవరణలు గావించి వెంటనే అమలు పరచాలని మహిళలు, దేశవ్యాపిత ఆందోళన గావించాలి. కాలయాపన జేయుట మన ప్రభుత్వానికి పరిపాటి. ఈ చట్టాలను గూడ మిగత చట్టాలు తయారయ్యేవరకు ఆపి 1946 జనవరినుండి అమలుపెట్ట దలచినట్లుగా ప్రకటించింది. ఇక నెంత మాత్రం జాగు చెయ్యరాదనీ, వెంటనే పైన సూచించిన సవరణలు గావించి 1943 జనవరినుండి అమలు పెట్టాలని ప్రభుత్వంమీద ఒత్తిడి తీసుకరావాలి.

వీరికి ముక్తి ఎపుడు?

కామ్రేడ్ యం. వెంకటాచారి, యం. ఏ.

1930—32 సంవత్సరాల్లో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలోను, గాంధీ-యిర్వెన్ ఒడంబడిక తరువాత శాసనోల్లంఘనోద్యమంలోను, పాల్గొన్నాడు. వీరవాసరంలో లాఠీ దెబ్బలు తిన్నాడు. రెండుసార్లు చెరసాలశిక్ష అనుభవించాడు. జైలులో కమ్యూనిజాన్నిగురించి తెలుసుకున్నాడు. 1935 లో కమ్యూనిస్టుపార్టీ సభ్యుడైనాడు. ఆ సంవత్సరమే ఆంధ్రరాష్ట్ర యువజనసంఘానికి ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డాడు. 1937 లో ప. గో. కాంగ్రెసు కమిటీ అధ్యక్షునిగా ఎన్నుకోబడినాడు. ఆ వేసవిలోనే కొత్తపట్నం రాజకీయపాఠశాలలో అధ్యయనం చేస్తూ తీవ్రంగా లాఠీదెబ్బలకు గురియై కోర్టుచే శిక్షింపబడ్డాడు. కాంగ్రెసు మంత్రివర్గం ఏర్పడగానే విడుదలకాబడ్డాడు.

కామ్రేడ్ అల్లూరి

1934 నుంచి రాష్ట్ర కాంగ్రెసు కమిటీసభ్యుడుగావున్నాడు. 1936 నుంచి వరుసగా అ. భా. కాం. క. సభ్యుడు. జిల్లా రైతుసంఘములో గూడ కృషిచేశాడు.

1939 యుద్ధంప్రారంభమైన తర్వాత జీన్నూరులో యింటర్న్ చేయబడ్డాడు. కమ్యూనిస్టు కార్యక్రమాన్ని నడిపిస్తూవున్నాడను అనుమానంతో ప్రభుత్వం అరెస్టుచేసి వెల్లూరుజైలుకు పంపింది. అప్పటినుంచి ఆ జైల్లో డిటెన్యూగా నిర్బంధితుడైయున్నాడు.

ప్రజలను వుద్రూతలూగించే వుపన్యాస ధోరణి అతనిదని అందరూ ఎరిగినదే.

దుష్టఫాసిస్టుల దుష్కృత్యాల్ని మన ప్రజలకు తెలియజేసి దేశానికి రానున్నవుపద్రవాన్ని గుర్తించేటట్టు చేయడానికి మన కామ్రేడ్ అల్లూరి ఎంత సమర్థుడు! దురాక్రమదారులబారినుండి మన పవిత్ర మాతృభూమిని రక్షించుకోడానికిగాను మన దేశీయుల్ని సమీకరించడానికి ఈ కామ్రేడ్‌ను సత్వరం విడుదల చేయాలి.

కామ్రేడ్ కొరపాటి పట్టాభిరామయ్య

1933 లో సైన్యంలో చేరాడు. రెండు సంవత్సరాలు సైన్యశిక్షణ పొందాడు.

ఆ తర్వాత ప్రజలమధ్యకి వచ్చాడు. 1936 లో తూ. గో. బోర్డు యెన్నికల్లో కాంగ్రెసు అభ్యర్థుల విజయానికి కృషి చేశాడు. జి. కాం. కమిటీ సభ్యుడైనాడు.

1937 లో కమ్యూనిస్టు పతాకము క్రింద సైనికుడైనాడు. బోల్షివిక్ పట్టుదలతో వివిధ ప్రజా సంఘాల్లో పనిచేశాడు. రైతు సంఘం, వ్యవసాయ కూలీల సంఘం, ఏజన్సీ ప్రజల సంఘం, ఇవన్నీ ఏర్పడ్డానికి, అభివృద్ధి కావడానికి యెంతో తోడ్పడ్డాడు.

కాంగ్రెసు మంత్రివర్గ హయాములో జమీందారీ రైతుల కష్ట నష్టాల్ని విచారించడానికి ప్రకాశం కమిటీ రాజమహేంద్రవరం వచ్చినపుడు వేలకువేలు జమీనురైతులు ఆ పట్టణానికి వచ్చి బ్రహ్మాండమైన వూరేగింపు చేశారు. ఆ దృశ్యాన్ని చూసినవాళ్ళు, అనాటి ప్రజా వుత్సాహాన్ని యెన్నటికిని మరచిపోలేము అని చెప్పారు. ఎంతోమంది రైతులు సాక్ష్యలిచ్చారు. ఊరూరుతిరిగి రైతుల్ని సహాయత్త పరచింది యెవరు? ఈ కామ్రేడే!

ఈ యుద్ధానికి మునుపు కాకినాడ కార్మిక పోరాటాల్ని నడిపి జయప్రదంగా ముగినేటట్లు చేసిన ప్రముఖుల్లో ఇతనూ ఒకడు.

పోలీసులకు చిక్కకుండా పార్టీసేవ అమోఘంగాచేశాడు, 1941 ఆగష్టులో అరెస్టుకాబడి వెల్లూరు జైలులో డిటెన్యూగా వుంచబడ్డాడు.

ఒక నెల గడవక మునుపే నల్గురు యితర కామ్రేడ్సుతోపాటు జైలునుంచి తప్పించుకుపోయాడన్న వార్త విని ఆంధ్రప్రజలు విస్తుపోయారు. జైలు గోడలు ఆ వీర సైనికుణ్ణి బంధించి యుంచగలవా మరి!

ఇటీవలనే అతనితోపాటు జైలు నుంచి తప్పించుకు వచ్చిన కామ్రేడ్ దాట్ల సూర్యనారాయణరాజుమీద వున్న వారంటును ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఇతని మీద వున్న వారంటును గూడ తీసివేయడంలో ప్రభుత్వం యేమాత్రం ఆలస్యం చేయకూడదు. జపాన్ హంతకుల్ని తరుమడానికి యీ కామ్రేడ్ యెంతో ఉపకరించుతాడు.

కామ్రేడ్ మహీధర రామమోహన్

"మనదు మేని యెముకలన్ని వేర్చి
యద్దుకొట్టుదాం,
ప్రాణమిచ్చి ఫాసిజాన్ని మంట గలిపి
తీరుదాం"

వెల్లూరులో డిటెన్యూగా వుంటూనే రామమోహన్ రచించిన ఫాసిస్టు ప్రతికూల గీతంలోని ఒకచరణం యిది. ఫాసిస్టుల పట్ల యితనికి గల ద్వేషాగ్ని ఎంత తీవ్రమైనదో! గడచిన నెలలో పార్టీచే నడుపబడ్డ పెదపాడు ప్రజారక్షణ శిక్షణా శిబిరంలోని విద్యార్థులు బారులు తీరి మార్చి చేసుకుంటూ ఈ పాటను పాడుతూ గ్రామాల్లో పెరేడ్ చేస్తూవుండగా చూసిన మాకు ఈ పాటయొక్క మహిమ వెల్లడి అయింది.

'మనరాష్ట్రంలో విశ్వసాహిత్యమాల' పేరు విననివాళ్ళు చాలా అరుదుగావుంటారు. 1935 నుంచి సోషలిష్టుగ్రంథాలు, జాతీయ గ్రంథాలు ఎన్నో ఆంధ్రప్రజలకు కానుకగా అర్పించింది. దీనికి కారకులైన మహీధరసోదరుల్ని దేశం మరచిపోలేదు.

కుటుంబం అంతా కమ్యూనిస్టుపార్టీకి సేవ చేసింది. స్వంతప్రెస్‌లో అందరూ పనిచేసి చౌకవెలకు పుస్తకాల్ని మనకు అందించారు. రామమోహన్ కాక, యింకా యిద్దరు సోదరులు కమ్యూనిస్టువుద్యమంలో పనిచేసి బళ్లారి జైలులో శిక్ష అనుభవించి ఇటీవలనే విడుదల అయినారు.

ప్రభుత్వం స్వాధీనపరచుకున్న వీరిప్రెస్, ప్రజావత్తిడిఫలితంగా, తిరిగి వీరికి యిచ్చివేయడానికి ఆర్డరు జారీచేసిందని మొన్ననే రూఢియైనవార్త తెలిసింది.

1940—41 లో యితనిపేర వారంటు వున్నప్పటికి పోలీసులకు అందకుండా చాలా కాలంపనిచేసి చివరకు పట్టుబడ్డారు, ప్రస్తుతం వెల్లూరు జైలులో డిటెన్యూగావున్నారు.

ఫాసిస్టు ప్రతికూలగీతాల్ని పుస్తకాలను వ్రాసి 'విశ్వసాహిత్యమాల'లో ప్రచురించి ఫాసిస్టుల దుష్టస్వభావాన్ని ప్రజలకు తెలియ జేయడానికి ఈ కామ్రేడ్‌పార్టీకి ఎంతో అవుసరం.

కామ్రేడ్ నంబూరి శ్రీనివాసరావు

"తుపాకిగుండ్లకంటె ప్రచారం ఎక్కువ అవుసరం"

అయిదేండ్లపాటు వీరోచితంగా జపాను దుండగీండ్రను ఎదుర్కొన్న వీరశైనా జాతీయ నాయకుడు మార్షల్ చియాంగ్ కైషెకు యిచ్చిన ప్రసంగంలోని ఒక వ్యాసం యిది.

వ్యవసాయకూలీల్లో జనించిన కామ్రేడ్ నంబూరి ప్రచారంలో ఆరితేరినవ్యక్తి. చిన్నప్పుడు పొలాల్లో కూలీగాపనిచేస్తూనే వీధినాటకాల్లో పాల్గొనేవాడు.

1937 లో తూ. గో. జిల్లాలో వ్యవసాయ కూలీ సంఘాలు యేర్పడిన రోజుల్లో పార్టీ పలుకుబడిలోకి వచ్చాడు. అప్పటినుంచి వ్యవసాయ కూలీల్లో పనిచేస్తూవున్నాడు. సోషలిస్టు హరికథలు సృష్టించింది యితనే. మన రాష్ట్రములో మూడు,నాలుగు జిల్లాలలో ఇట్టి కథలు యెన్నో గ్రామాల్లో చెప్పాడు. ఎంతో రసవంతంగా వుంటాయి. వేలకొలది జనం యీ కామ్రేడ్ చెప్పిన కథల్నివిని తిరిగి మరోసారి వినాలని కోరేవారు.

కార్యరంగంలోనూ వెనుదీయలేదు. చారిత్రాత్మకమైన 1939 కాకినాడ కార్మిక సమ్మెలలో పాల్గొని అరెస్టు అయినాడు.

సామ్రాజ్య వాద యుద్ధకాలంలో అరెస్టు వారంటును తప్పించుకొని చాలా నెలలు అనేక జిల్లాల వూళ్లల్లో సోషలిస్టు హరికథలు శ్రావ్యంగా చెప్పాడు.

చివరకు పట్టుబడి బళ్లారిలో శిక్ష అనుభవించి వెల్లూరుకు డిటెన్యూగా కొనిరాబడ్డాడు. అనేక ఫాసిస్టు వ్యతిరేక గీతాలు రచించాడు.

ఈ కామ్రేడ్ ప్రచారం ప్రజాసామాన్యంలో ఫాసిస్టు వ్యతిరేక భావాల్ని దృఢపరుస్తాయి. ఇతను విడుదలకావడానికి ఏమాత్రం ఆలస్యం కాకూడదు.

కామ్రేడ్ కొసరాజు శేషయ్య

కృష్ణా జిల్లాలో చాలా ప్రసిద్ధి గాంచాడు కామ్రేడ్ శేషయ్య.

1930—32 వుద్యమంలో చాలాబాగా పనిచేసి లాఠీ దెబ్బలు తిని జైలుశిక్ష అనుభవించాడు. ఆరోజుల్లో 'అపరాధపు పన్ను' విధించబడ్డ వెంట్రప్రగడ గ్రామం ఇతని స్వంత వూరు.

1934 లో కమ్యూనిష్టుచే నెలకొల్పబడ్డ 'ఆం. రా. కార్మిక రక్షణ సంఘ రాష్ట్ర కమిటీ'లో సభ్యుడు, అప్పటినుంచీ పార్టీ సభ్యుడుగా వుంటూనే వున్నాడు. మూడునాలుగు యేండ్లు జిల్లా కమ్యూనిష్టు పార్టీ కార్యదర్శిగా పనిచేశాడు.

సామ్రాజ్యవాద యుద్ధకాలంలో డిటెన్షన్ వారంటు అందుకోకుండా రహస్యంగా పార్టీపని చేశాడు. 1941 మే నెలలో పట్టుబడి వెల్లూరులో డిటెన్యూగా నిర్బంధింపబడ్డాడు.

అనుభవంగల పార్టీ నాయకుడు. జపాన్ దుండగీడులకు వ్యతిరేకంగా ప్రజలను ఆర్గనైజు చేయడానికి యెంతేని ఉపకరిస్తాడు.

పై కామ్రేడ్స్ అందరనూ ప్రభుత్వం విడుదల చేయాలి.

మహిళా వర్కర్ల సంచారం

ఆగష్టు 2వతేదీన సమావేశమైన కృష్ణాజిల్లా వర్కింగుకమిటీ నిర్ణయంప్రకారం కె. హనుమాయమ్మ, వై. కమల, వి. అన్నపూర్ణమ్మ, యం. విమల, యం. సూర్యావతి గార్లు మూడు బ్యాచీలగ ఏర్పడి దివితాలూకాలో 13 గ్రామాల్లోను, గన్నవరంతాలూకాలో 6 గ్రామాల్లోను పర్యటనం చేశారు.

దివి తాలూకాలో

మంగళాపురం, కప్తానుపాలెంలకు కె.హనుమాయమ్మ, వై. కమల, వి. అన్నపూర్ణమ్మ, యం. విమలగార్లు కలిసి వెళ్ళారు. మంగళాపురంలో మూడుచోట్ల ప్రత్యేక సమావేశాలు జరిపారు. దాదాపు 120 మంది స్త్రీలువచ్చారు. స్త్రీలకు పురుషులకు కలిసి మరోసభ జరుపబడింది. 200 మంది వచ్చారు, ఆ సభలో కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు స్త్రీల సంఘ ఆశయాలు, అవిచేస్తున్నకార్యక్రమం వివరిస్తూ విపులంగా ఉపన్యసించాడు. కప్తానుపాలెం సభకు 40 మంది స్త్రీలువిచ్చేశారు.

కె. హనుమాయమ్మ, వై. కమలగార్లు నాదెళ్లవారిపాలెం వెళ్లారు. అక్కడి రెండు సమావేశాలకి 30 మంది హాజరైనారు. కొక్కిలిగడ్డలో 25 గురు అవనిగడ్డలో 24 గురువచ్చారు. మాచవరంలో 40 మందిస్త్రీలు, 60 మంది పురుషులు సభకువచ్చారు. కొత్తపాలెంలో సభకు 60 మంది హాజరయ్యారు.

వి. అన్నపూర్ణమ్మ, యం. విమలగార్లు చినకళ్లేపల్లి, ఘంటశాల, ఘంటశాలపాలెం, కాజగ్రామాలు వెళ్లారు. ఈ గ్రామాల్లో జరిగిన సభలకు మొత్తం 90 మంది స్త్రీలు వచ్చారు.

ప్రతిచోట సమావేశాలకు ముందు స్థానిక వర్కర్లను, కొంతమంది స్త్రీలను కలుసుకొని ఆయాగ్రామాల స్త్రీల అలవాట్లు, ఆచారాలు ఎల్లా వున్నవి తెలుసు కున్నారు. సంఘఆశయాలు, ప్రస్తుతం చేస్తున్నపని, ఇతర దేశ స్త్రీల వుద్యమాలు, ప్రస్తుత ప్రజాయుద్ధంలో స్త్రీల కర్తవ్యం, ఆరోగ్యం, శిశుపోషణ—ఈ విషయాలమీద వుపన్యాసా లివ్వబడినవి.

ఎక్కువ చోట్ల స్త్రీలుఅత్యంత వుత్సాహాన్ని కనబరచారు.

అగష్టు మొదటి రెండు వారాల్లో దివితాలూకా సంచార కార్యక్రమం జరిగింది.

గన్నవరం తాలూకాలో

మానికొండ సూర్యావతిగారు అగష్టు 2 వ వారంలో ఇందుపల్లి, నందమూరు, కాటూరు, పొట్లపాడు గ్రామాల్లోను, 4వ వారంలో గరికపర్రు కాసరనేనివారిపాలెంలోను పర్యటనం చేశారు.

ఇందుపల్లి, కాటూరు, గరికపర్రులలో ప్రతి రోజూ అధ్యయన తరగతులు నడుపుకొనుచున్నారు. ప్రతిగ్రామంలో 10 మంది స్త్రీలు అధ్యయన తరగతికి హాజరవుతున్నారు.

ఇందుపల్లి, నందమూరులలో 65 మంది స్త్రీల సంతకాలతో కయ్యూరు వురిశిక్షలను రద్దుచేయవలసినదిగా కోరుతూ ప్రభుత్వానికి మహజర్లు పంపబడినవి.

పొట్లపాడులో జరిగిన సభకు 40 మంది స్త్రీలు వచ్చారు.

• • •

క్రాప మహిళా సంఘం

తెనాలి తాలూకా క్రాప మహిళా సంఘ సమావేశం ఆగష్టు 30వ తేదీన కె. నరసమ్మ గారి అధ్యక్షతను జరిగింది. ప్రస్తుతరాజకీయాలపై వుపన్యాసం యివ్వబడింది.

★ నాటిక

గెరిల్లాలు

రచయిత: కామ్రేడ్ డాక్టరు రాంబాబు

పాత్రలు

1. పావెల్ }
2. నకోడా } (ఇద్దరు రష్యనుగెరిల్లాలు)
3. 20 మంది నాజీసైనికులు
4. కొంత రష్యన్ గెరిల్లాదళం

[శత్రు ఆక్రమిత రష్యాలో—

ఒక కూలిపోయిన ఇంటిముందు — పావెల్, నకోడాలు ఎక్కడనుంచో వచ్చి నిలుచునిఉంటారు. వారిని చూడగానే పావెల్ ముఖంలో సునిశితత్వం, నకోడా ముఖంలో కఠినత్వం కూడా చూడవచ్చు—మొత్తానికి ఇద్దరూ కార్యదీక్షా కంకణ శిఖామణుల్లా ఉంటారు. వారు ధరించినబట్టలు సాధారణమైనవే గాని; అక్కడక్కడా చినిగి, ఎట్టమన్ను కొట్టుకొని ఉంటాయి. సంభాషణసాగిస్తున్నారు.]

నకోడా: ఆఁ చెప్పు, చెప్పు, ఏం జరిగింది? హిట్లరు దానిసలు అక్కడ తిష్ఠవేశారా? అయితే మనవాళ్లు చూస్తూ ఎందుకూరుకొన్నారు? దెబ్బతో కపాలమోక్షం చూపించవలసింది.

పావెల్: అహ్హా హ్హా! ఆఁ అదెలాగో చూశారు. మన గెరిల్లామిత్రులు వాళ్లను తరిమి తరిమి, చితకబొడిచి చంపేశారు. చచ్చాక వాళ్ల జేబుల్ని గాలిస్తే కొన్ని కాగితాలు దొరికాయి. వాటిల్లో - జర్మను నాజీప్రభుత్వం జారీచేసిన ఆజ్ఞలు-'జర్మనీ ప్రబుద్ధులారా! ప్రపంచంలో వివిధదేశాల్లో కంటే రష్యా మీకు చక్కటి విహారభూమి; రష్యాస్త్రీలు మీభోగస్త్రీలు; అక్కడి పురుషులు మీబానిసలు. వారిని వశంచేసుకొని మీరెలా ఉపయోగించుకున్నా ఉపయోగించుకోవచ్చు. మీకు లొంగని ప్రతివారినీ నాశనంచేయడమే మీ ఉత్కృష్ట కర్తవ్యం. అందువల్ల మీ భవిష్యత్తును మీకనుకూలంచేసుకొని పవిత్రజర్మనులనిపించుకొంటారు.' అని ఉంది. (అని దూరంగాచూస్తూ ఆశ్చర్యపోతుంటాడు.)

నకోడా: ఆ వచ్చేవాళ్లు జర్మనీ జంతువుల్లాగే ఉన్నారు. హిట్లరు జర్మనీలోతిండిలేక తోలినగొడ్లు ఇటువస్తున్నాయి. ఇక్కడ తిండితిని ఈ ఉపయోగంలేని గొడ్లు చావవలసిందేకాని; బ్రతికి జర్మనీలో ఉన్న దూడల్నీ, తమ పాలెకాపుల్నీ చూడలేవు. రాండి! మీ బడితెబాజా పడతాము.

పావెల్: పరుగెత్తు! సమీపంలో ఎక్కడయినా దాక్కొని వీళ్లపని పడదాము. (ఇద్దరూ పరుగెత్తుతుంటారు.)

నకోడా: వాళ్లు మనల్ని తరిమి పట్టుకొంటే ఏంచేద్దాం? సమయానికి మన గెరిల్లాదళం సమీపంలో ఎక్కడా లేనట్టుంది.

పావెల్: వాళ్లు మనల్ని పట్టుకొంటారా? నువ్వుమాత్రం నే నడిచినట్టు నడు. వాళ్లకు సమాధానం చెపుతాను నేను.

నకోడా: అరుగో! దగ్గరికి వచ్చేస్తున్నారు. ఎంతోమంది లేరు - ఇఱవైమందుంటారేమో! వాళ్లను మనిద్దఱం రూపుమాపలేం?

పావెల్: సునాయాసంగా రూపుమాపుతాం. (జేబులోచేయి తీసి) ఇదిగో- ఈ నాజీగుర్తుబిళ్ల నీ భుజానికి తగిలించు. తర్వాతపని నే చేస్తాను. (అని తానొకబిళ్లను భుజానికి తగిలించుకొంటాడు. దూరంనుంచి పొలికేకలు వినపడుతుంటాయి.)

నకోడా: అయితే వాళ్లను మోసగించి వలలో వేసుకోవాలన్నమాట! అదేమిటి? వాళ్లకు సైనికులకుండవలసిన దుస్తులులేవే? చిరిగిపోయిన దుస్తులతో, తుపాకులతో బ్రతికిఉన్నశవాల్లా వస్తున్నారు.

పావెల్: జర్మనీలో కరవు ఏర్పడింది. సైనికులకు తగిన తిండిలేదు సరేకదా దుస్తులసలే దొరకడంలేదు. నీకు తెలుసుగా- మన గెరిల్లా దళాలు వీళ్లను దిగంబరులుగాకూడా చేసే ఉపాయా లుపయోగిస్తున్నాయి. వాళ్లముఖాలు చూశావా? కొండలు, నదులు, నూతులూ, అడవులూ,....అన్నీ వాళ్ల ముఖంలోనే ఉన్నాయి. (నవ్వుతాడు)

నకోడా: ఏ ఒక్కడిముఖంలోనూ ఉత్సాహంలేదు. ఆకలితో చస్తున్నట్టున్నారు.

పావెల్: నువ్వేమీ మాట్లాడవద్దు. నిన్నెంతబాధించిన నోరు మెదిపి సమాధానంచెప్పవద్దు. అంతా నేను మాట్లాడతాను. (అని మడిచి ఉన్న తన చొక్కాచేతులు క్రిందికి లాగుకొంటాడు.)

నకోడా: (తనుకూడా అలాచేసి, జేబు వెతుక్కొని) అరే! నాజేబులో కత్తుండాలి. మనం పరుగెత్తుతుంటే పోయిందేమో! (అని తనచుట్టూ చూచుకుంటాడు.)

పావెల్: పోయినదానికి ఆలోచించకు. అయితే అదిగో! వాటంగావున్న ఆకట్టెముక్క జేబులోవేసుకో! కత్తిలానే పొడవడానికి పనికివస్తుందిలే.

నకోడా: (నవ్వుతూ ఆచిన్నపుల్ల జేబులోవేసుకొని)యుక్రెయిను లోకల్లా ఈపరగణా నేలలే కొంచెం సారంలేనివంటారు. జర్మను నాజీల రక్తంపోసి ఈనేలను పదునుచేయాలి. వచ్చేయేడు మన సమిష్టి వ్యవసాయకులు పంటలు బాగా పండిస్తారు. (అని పళ్లు కొరుకుతుంటాడు)

పావెల్: ఇక ఊరుకో! నాజీలు దగ్గఱగా వచ్చేశారు. మనమాటలు వినపడతాయి. (వస్తున్న నాజీలకు తనభుజం మీది నాజీగుర్తు కనబడే వాటంగా నుంచుంటాడు. నకోడా కూడా అలానేచేస్తాడు.....ఇరవైమంది నాజీలు దగ్గరగా వచ్చి—)

ఒకనాజీ: మాకుచాలా సంతోషంగావుంది. మీరష్యనులు కూడా మా హిట్లరుని విశ్వసిస్తున్నారని ప్రత్యక్షంగాచూచి ఆనందిస్తున్నాము. (అందరూ వెకిలిగా నవ్వుతుంటారు.) ఇప్పుడు మేమలసిపోయియున్నాము. మాకు సుఖం కలుగజేయవలసిన బాధ్యత మీది.

ఇంకోనాజీ: మీ పడుచుపిల్లలు బాగుంటారు. మీకు అమ్మాయిలున్నారా?

నకోడా: (ముఖంలో కనబడని తీవ్రతచూపుతూ పళ్లుకొరుకుతుంటాడు.)

పావెల్: (నవ్వుతూ) అలసివున్న మీరేమి కోరుతారో అన్నీ మేము జాగ్రతచేసి యుంచాము. మీరు మావెంట వచ్చి విశ్రాంతి బొందండి.

ఒకనాజీ: (నకోడా చేయి పట్టుకొని) ఏయ్! నీకెందఱు కూతుళ్లు? వాళ్ళను మాకెందు కెదురుతీసుకురాలేదు?

నకోడా: (పావెల్‌వంక చూస్తాడు.)

పావెల్: అతని కెవరూ కూతుళ్లు లేరు. నాకు ఆరుగురు కూతుళ్లున్నారు. ఇప్పుడు మాయింటికి వస్తే వారందఱూ మీకు సుఖాన్నిస్తారు. మీ ఆగమనానికి ఎదురుచూచేవాళ్లు ఇంకా చాలామందున్నారు.

నాజీలు: (సంతోషంతో చప్పట్లు కొడతారు. పావెల్ భుజం మీద స్నేహస్పర్శ చేస్తూ-) అయితే పదండి! త్వరగా పోదాము.

పావెల్: (ముందు దారితీస్తూ-) మీరు హడావిడి చేయకుండా రావాలి. ఇక్కడ మేము మెసలడమే కష్టంగా వుంది. ఎక్కడపడితే అక్కడ గెరిల్లాలు తిరుగుతున్నారు. మా వెంట తిన్నగా వచ్చారంటే మీ ప్రాణాల కేమీ భంగంరాదు. (చుట్టూ తుప్పలు రహస్యమందిరాల్లా వుంటాయి. రాళ్లు ఎక్కడనుంచో పడుతుంటాయి. ఎవరూ కనపడరు.) అవిగో! చూచారా! రాళ్ళు. ఎవరో గెరిల్లాలు రాళ్ళు విసరుతున్నారు. మీదగ్గర ఆయుధాలు వాళ్ళనేమీ చేయలేవు. కనుక మా వెంట జాగ్రత్తగా రండి. మీరు విశ్రాంతి తీసుకొన్నాక గెరిల్లాలను మీకు చూపుతాను. వారిని మీరు వేటాడవచ్చు.

ఒకనాజీ: (అనుమానిస్తూ) నిజంగా మీరు మా మేలు కోరేవారేనా? మిమ్మల్ని ఇక్కడ చంపామంటే దిక్కులేదు.

మఱోనాజీ: అ-బ్బా! ఆకలివేస్తోంది. ఇంకెంతదూరం పోవాలో? (కూలబడపోతాడు.)

పావెల్: రండి! రండి!! ఇంకెంతోదూరం లేదు. దగ్గరకు వచ్చేశాము. మేము పుట్టడమే హిట్లరు సేవచేయడానికి పుట్టాము. హిట్లరును మిమ్మచూచినట్టు ఎప్పుడు చూస్తామా అని మా ఆశ. మీరు మమ్మెంతమాత్రం అనుమానించవద్దు.

ఒకనాజీ: నిజంగా మీరు మా సేవకులే! అయితే ఇప్పుడు మేము తినడాని కేముంటాయి?

పావెల్: నేయివేసిన రొట్లుంటాయి. ఇంకా ఏమయినా కావలసుంటే అవి మావాడు తీసుకువస్తాడు. అదిగో, ఆ కనబడేదే మన వసతిగృహం! (నకోడాతో-) ముందు నీవెళ్ళి తలుపుతీసి అన్నీ సర్దు. రొట్టెమీద నేయివేసి సిద్ధపరచి వుంచు.

నకోడా: (త్వరత్వరగా నడుస్తుంటాడు.)

ఒకనాజీ: ఏయ్! ఏయ్!! ఎవరన్నా అమ్మాయిలనుకూడా తీసుకురా! లేకపోతే తిన్నది అరగదు.

పావెల్: మీకు చేసే సదుపాయాలన్నీ అతనికి తెలుసు. మీ రేనాడు పొందని సౌఖ్యాన్ని నేడు మీరు పొందగలరు. మొన్నటిరోజున అరవైమంది మీ జర్మనులకు అతిథ్యమిచ్చాము. వారెంతో సంతోషించి మిగిలినవాళ్ళకూడా అటువంటి సదుపాయాలే చేయమని చెప్పిపోయారు. మీకు మేముచేసిన యేర్పాటులు ఎంతో సుఖాన్నిచ్చి మిమ్మల్ని సమరోత్సాహులుగా జేస్తాయి.

ఒకనాజీ: భేష్! భేష్!! హిట్లరందు విశ్వాసంగల మీరు మమ్మాదరించాలి. మేము బ్రతకడమే హిట్లరు క్షేమమనుకొని మాకు సేవచేయండి.

పావెల్: అందులో ఏమీ సందేహంలేదు. హిట్లరు ఎంతటివాడో మేము పూర్తిగా అర్థం చేసుకొన్నాము. అదంతా ఎందుకు? మా విశ్వాసం మాఏర్పాట్లు చూస్తే తెలుస్తుంది.

(అందరు వసతిగృహం దగ్గఱికి వచ్చేశారు. లోపల నకోడా రొట్టెల మీద నేయి దిట్టంగావేసి సిద్ధపరుస్తున్నాడు. ఆవురావురుమంటున్న ఒకో నాజీ ఆ కొంపలోదూరి చేతికందిన రొట్టెలుతింటున్నారు. నకోడా ఇంకా రొట్టెలు తెచ్చిఇస్తున్నాడు. ఇంటిచుట్టూ జెముడుపొదలు గోడల్లా వున్నాయి. ఎటుచూచినా మనుష్యసంచారం లేదు.)

ఒకనాజీ: రొట్టెలు బలేరుచిగా వున్నాయి. నేయిమాత్రం ఏమీ బాగోలేదు...అ-బ్బా! వికారంగా ఉంది. వెధవలు- ఈ రష్యనులమాదిరిగానే వీళ్ళ గొడ్లుకూడా వుంటాయి కాబోలు!

ఇంకోనాజీ: ఇప్పటిమట్టుకు ఏదొకటి తిని కడుపు చల్లార్చుకోండి. (గోడవంక క్రోధంతో చూస్తూ) ఏయ్! ఆబొమ్మేమిటి? హిట్లరును సుత్తికొడవలితో చంపుతున్నట్టు చిత్రించిరా? అరే! సుత్తికొడవలి రాజ్యాన్ని జర్మనీలో స్థాపిస్తారా? దరిద్రుల్లారా! (గభాలున లేచి గోడనున్న బొమ్మల్ని బట్టున చింపి పారవేస్తాడు.)

మఱోనాజీ: ఎవరాబొమ్మలువేసింది? (అని పావెల్ చేయి గుంజుతాడు.)

పావెల్: (సహజంగావచ్చిన కోపమాపుకొని) ఈఇంట్లో నాజీ వ్యతిరేకప్రచార కార్యాలయం వుండేది. వాళ్లనేకవిధాలయిన ప్రచారాలుచేసి నాజీలను హతమార్చాలనే భావం ప్రజల్లో వ్యాపింపచేసేవారు. ఈ చిత్రాలన్నీ వాళ్ల ప్రచురించినవే! వాళ్లిక్కడనుండి కార్యాలయం మార్చేసుకొన్నారు. మీరు విశ్రాంతి తీసుకొన్నాక వాళ్లనుకూడా చూపుతాము.

ఒకనాజీ: సరేలే! ఉండగా ఉండగా మీరష్యనులచేతులు మాహిట్లరుకి చాపా స్నేహక్కవచేస్తున్నాయి. మిమ్మల్ని

హతమార్చే ప్రయత్నంలో అతను తన సర్వశక్తులూ ఉపయోగిస్తాడు........పరేకాని మీ అమ్మాయి ఉంటా రన్నారే! మమ్మల్ని మోసగించేటట్టున్నారే!

పావెల్ : (తత్తరపడుతూ) నకోడా! మన నటాషావాళ్లేరీ! ఇంకా ఏమయినా తేవడానికి వెళ్ళారా?

నకోడా : నే వచ్చేటప్పటికే ఎక్కడి రొట్టెలక్కడ పడి వున్నాయి. నెయ్యి పొయ్యిమీదుండిపోయింది. మనం నాజీల్లో కలవడం ఇష్టంలేక వాళ్ళు గెరిల్లాల్లో కలుస్తామని పోయారట. ఇదిగో ఈ కాగితం ఇక్కడ పడేసిపోయారు. (అని ఒక కాగితం యిస్తాడు. నాజీలు ఆశ్చర్యంగా వింటారు.)

పావెల్ : అరిభదవలు! అలా చేస్తారనే నేను వాళ్ళ నొక కంటితో చూస్తూనే వున్నాను. అయితే వాళ్లను పట్టుకొని నరికివేయాలి. (పళ్ళు కొరుకుతూ నాజీలతో) బ్రదర్స్! వాళ్లను పట్టుకొనడానికి మీరు నాకు సాయపడాలి. మీరు రొట్టెలు తిని విశ్రాంతి తీసుకోండి. మీతుపాకుల్లో గుళ్ళు న్నాయా? లేకపోతే ఇస్తాను. మీరు నావెంటరండి.

నాజీలు : ఆఁ మీ గెరిల్లాలను గోరీకడతాము. సరే! హిట్లరుని తలచుకొని బయలుదేరి వాళ్ళను పట్టుకొందాము.

పావెల్ : మాకు ఆకలివేస్తోంది. వున్న రొట్టెలన్నీ మీరే తినివేశారు. ఇక మాకు లేవు. మేము రొట్టెల తెచ్చుకొంటాము. ఇంకా మీక్కూడా తెస్తాము. వాటిని తిన్నాక గెరిల్లాలమీద దండెత్తుదాము. (అని నకోడాతో బయటికి వస్తాడు. వాళ్ళిద్దరూ బయటికి రావడం, కళ్ళు తిరుగుతున్న నాజీలు కనిపెడుతూనే వుంటారు.)

పావెల్ : (కొంతదూరంపోయాక) వీళ్లను ఇంతవరకు జాగ్రత్తచేశాము. ఇక చంపేదెలా? మన గెరిల్లాదళాన్ని ఇంటిమీదకు దూకేటట్టుచేదామా? నాజీలు అలసివున్నారు గా; ఏమీ చేయలేరు.

నకోడా : (నవ్వుతూ) గెరిల్లాలయిన మీ ఆరుగురమ్మాయి లనూ దండెత్తించు.

పావెల్ : (బిగ్గరగా నవ్వుతూ) నాకు పెళ్లమేలేనిది పిల్ల లెక్కడనుంచి వస్తారోయ్! ఏదో ఆకామాంధులను దూపు కొట్టాను. నువ్వుకూడా సరిగా నటించావు. అందరూ ఇలా వుంటే నాజీలను బూడిద చేయవచ్చు.

నకోడా : ఊఁ ఇంకా? ఆగారేం? ఆ అరుపులేమిటో విన బడుతున్నాయా?

పావెల్ : ఏమిటి? నాజీలగొంతుల్లావున్నాయే! చావుకేకలు వేస్తున్నారు. ఏంటో చూదామా వెళ్ళి?

నకోడా : నే నిప్పుడు రాను. నాబాధ్యత తీరిపోయింది. మనవాళ్ళకు ఈవిషయాన్ని అందజేయాలి. నాజీలుఅందరూ ఒక్కసారి చచ్చివుంటారులే! ఆ దున్నలకేకలు విన్నావా? వాళ్లందరూ హిట్లరునినమ్ముకొని కూర్చున్నారు. ఇప్పుడు వాళ్ల చస్తుంటే హిట్లరేమయినా వచ్చి రక్షిస్తున్నాడా? మూఢులు!

పావెల్ : నీ మాటలేమీ అర్థం కావడం లేదు. రొట్టెలు పొట్టలనిండా కూరుకున్నవాళ్ళు యెలా చస్తారని నీ వుద్దేశం? నీకు ఆలోచనే లేదురా! అదేమిటో చూదాము.

నకోడా : నా మాటలు నీ కర్థం కావడం లేదు? ఇంకా వాళ్ళను యెలా చంపాలనే ఆలోచనలోనే నీవు వున్నావు. మన యింటిచుట్టూ జెముడు చెట్లున్నాయికాదూ? ఆపాలు తీసి నేయిలో కలిపి అందటికీ రొట్టెలో వడ్డించాను. అందుకనే వాళ్ళు డొక్కు చస్తున్నారు. వాళ్ళు తప్పక చచ్చిపోతారు. ఇక వాళ్ళని చంపడానికి మన మే ప్రయత్నము చేయవద్దు. ఇక మనం చేసేపని చచ్చినవాళ్ళను పరిశోధించి, వాళ్ళదగ్గర యేమున్నాయో తీసుకొనడమే!

పావెల్ : (నకోడాను కౌగలించుకొని) కామ్రేడ్! నిన్ను సోవియటు రష్యా అంతా అభినందిస్తుంది. నాజీలను చంపడానికి యెన్ని ఎత్తులుంటే అన్ని ఎత్తులూ వుపయోగించుకోవాలన్నమాటను, ఆచరణలో పెట్టావు. జెముడు పాలు విషం! వాటితో వాళ్ళను చంపవచ్చనే ఉద్దేశ్యం నీ కెలా తోచిందోయ్! కామ్రేడ్! నీకు అభివందనాలు. అయితే వాళ్ళు చచ్చివుంటారు. ఇక వెళ్లి చూదాం పద!

నకోడా : (సంతోషంతో) మన మిద్దఱమే వెళ్లవద్దు. అదిగో! మన గెరిల్లాదళం నాజీసంహారణంచేసి ఉత్సాహంగా వస్తూంది. (విజయనినాదాలతో గెరిల్లాదళం దగ్గ ఱగావస్తుంది.) రండి! ఇరవైమంది నాజీలను చంపాము. వాళ్లను పరిశోధించడానికి మీరూ రండి. మన కమిటీకి ఈ విషయాన్ని తెలియపఱచండి.

రష్యనుగెరిల్లాదళాధిపతి : ఇప్పుడే మేము వందమంది నాజీలను చంపివస్తున్నాము. ఎంతో ఆయుధసామగ్రి వశమయింది. అదంతా ప్రభుత్వానికి అందజేశాము. ఈ ఫార్సేమిటో చూదాంపదండి. (ఇరవైమంది నాజీ లున్న ఇంటిచుట్టూ చేరుతారు. నకోడా ముందుగా వెళ్లి నాజీలను చూస్తాడు అదంతా నానాచండాలమయి డోకులు........తో నిండిఉంటుంది.)

నకోడా : (అధిక సంతోషంతో యివతలకు వచ్చి) దుర్మార్గులు చచ్చారు. అందరూ సమానంగా బ్రతికే రష్యనులను చంపి ధనికవర్గాన్ని రష్యాలో స్థాపించాలని వచ్చిన హిట్లరు బానిసలు చచ్చారు. చచ్చారు. (అందరూ అతనితోపాటు లోనికి వెళ్ళి చచ్చిన నాజీలకున్న సంచులు పరిశోధిస్తారు. అందులో కొన్ని కాగితాలు దొరుకుతాయి. వట్టి తుపాకులు మాత్రం చచ్చిన నాజీల ప్రక్కన చచ్చినట్టు పడుంటాయి.)

పావెల్ : ఇదిగో! జర్మనీ సేనలకు హిట్లరు జారీ చేసిన కరపత్రం చదువుతాను వినండి.— "ఓ జర్మనీ సేవకులారా! యుద్ధం చేస్తున్న మీకు నా అభివందనాలు. మీ ప్రాణ దానమే మన పవిత్ర జర్మనీ గౌరవం నిలుపుతుంది. రష్యనులను మాత్రం వశం చేసుకున్నారంటే ప్రపంచమంతా మీ చేతుల్లో వుంటుంది. కాబట్టి మీ సర్వ శక్తులూ వుపయోగించి రష్యనులను గెలవండి. ఇదే మీ ప్యూరర్ మీకు వుత్సాహమిస్తూ చేసే ఆజ్ఞ!" విన్నారా! హిట్లరు ముష్కర ఆజ్ఞ?

నకోడా : ఇదిగో! నాజీజర్మనీయొక్క దాస్యసైనికులకు మన కార్మిక కర్షక దేశనాయకుడు స్టాలిన్ జారీచేసిన శ్రేయోదాయక కరపత్రం—"ఓ జర్మను సైనికులారా! మీ రెవరూ మాకు విరోధులుకారు. మే మెవరమూ మీకు విరోధులము కాము. మీరూమేమూ శ్రమజీవులమే! మీ నాజీ తత్వమే, మీ ధనికవర్గ అధికారమే, మీలో అజ్ఞానాన్ని వ్యాపింపజేసింది. సోవియట్‌రష్యా అంటే — మీ జర్మనీవలె ఏ కొందరికో సుఖా న్నిచ్చేదికాదు. ఇక్కడ అందఱికీ సుఖాలు సమంగా పంచబడుతాయి. హిట్లరు క్రూరమైన ఆజ్ఞలక్రింద మీ రెంత కృంగి కృశించి పోతున్నారో మాకు తెలుసు. హిట్లరు అనుచరులు తలపెట్టిన ఈ అధర్మయుద్ధంలో మీకు గొప్ప భవిష్యత్తున్నది. మీ ప్రాణాలు పోగొట్టుకోవద్దు. మీ ప్యూరర్‌కు ఎదురు తిరిగి మీ హక్కులను స్థాపించుకోండి. లేదా అస్త్ర సన్యాసం చేసి మాలో చేరండి. మాతోపాటు మీ రన్ని విధాలయిన సుఖాలనుభవించవచ్చు. మీ క్షేమం, మీ బిడ్డల క్షేమం, మీ తల్లిదండ్రుల క్షేమం, మీ దేశ క్షేమం కోరి ఈ కరపత్రం ప్రకటింపబడింది. మీ క్షేమాన్ని వరించే పత్రాన్ని తిరస్కరించారంటే మీరు పవిత్ర మనుకొంటున్న జర్మనీని బూడిద చేయించిన వాళ్ళవుతారు."

విన్నారా! మన కరపత్రాలు కూడ ఈ సైనికులు చదివారు. మూఢులు! నాజీలకు యేమీ తెలియదు. హిట్లరు చేసే యజ్ఞంలో యజ్ఞపశువు లవుతున్నారు.

రష్యను గెరిల్లా దళాధిపతి : నకోడా! నువ్వు నేటివఱకు ఒక గెరిల్లావు. నువ్వీనాడు మొదలు సామ్యవాద రష్యాను కాపాడుటకుగాను, ప్రాంతీయ గెరిల్లా దళాధిపతిగా వుంటావని ఆశిస్తున్నాను.

గెరిల్లాలందరూ :

జై సోవియటు రష్యాకు జై!
జై సామ్యవాద స్థాపకులకు జై!
నాజీజం నాశన మగుగాక!
విప్లవం వర్ధిల్లు గాక!
ప్రపంచ శాంతి స్థాపిత మగుగాక!

(సుత్తి, కొడవలి ఉన్న ఎఱ్ఱ తెర జారుతుంది.)

లేవరా! సోదరా!

["శ్రీరంగరంగరంగా" మాదిరి]

లేవరా సోదరా! గాఢనిద్దుర లేవరా!
ప్రజాయుద్ధమున నీ విధులా
నెరవేర్చ వేగమే లేవరా ॥లేవ॥

దుష్టులూ ఫాసిస్టువారలూ
దుర్మార్గులూ జర్మనులూ
దరిజేరవచ్చుచుండిరి
దూరమున వారినీ నిలబెట్టరా ॥లేవ॥

పచ్చిరక్తము త్రాగువారలూ
ప్రజను హింసింపనాసించు వారలూ
ఒక్కటే మార్గమ్మురా
వారి నెదిరించ సిద్ధముగనుండరా ॥లేవ॥

జాతియైక్యత ప్రధానమ్మురా
జనుల సమీకరణ రెండవదిరా
రెండాయుధాలే ముఖ్యమ్మురా
క్రూరఫాసిస్టుమూక నెదిరించనూ ॥లేవ॥

ప్రజాబలమును గుర్తించరా
దానిచే జపాను నెదిరించరా
అక్షరాజ్యాల నోడించుటేరా
మనకు స్వాతంత్రసంపాదనేరా
తోడిమానవుల రక్షించుటేరా
దాస్యవిముక్తికి ప్రాణంబులీయరా ॥లేవ॥

చరిత్రలో నీ నామాక్షరంబులూ
శిలాక్షరాలగు నట్లు చేయరా
ఆ చంద్రతారార్కంబుగా నిల్పరా
భారత మాతృభూమి కీర్తిచంద్రికలూ ॥లేవ॥

—కామ్రేడ్ కె. వి. కొండలరావు.

ఫాసిస్టులను పరిమార్చండి

["అగునాజీవాలు...." మాదిరి]

నిలచునాప్రాణాలు
దక్కునామానాలు
ఫాసిస్టురాక్షసుల
పరిమార్చిమనము
కదనరంగమునందు
విజయ మొందకపోతె
పశుబలముయిలనిల్వదా మనబ్రతుకు
భగ్నమైపోకుండునా

• • •

సామ్రాజ్యకాంక్షతో
చలరేగిఫాసిస్టు
అన్యదేశములను
అక్రమించెడివేళ
ఎదిరించివారిని
విజయ మొందకపోతె
ఆస్తిపాస్తులుదక్కునా మనబ్రతుకు
అన్యాయమైపోవదా

• • •

ప్రజలరక్తముపీల్చు
ఫాసిస్టుభూతములు
భారతావనివైపు
పయనమయ్యేవేళ
ఎదిరించివారిని
తిరిగి పంపకపేతె
దేశాన్ని హతమార్చరా
మనలను
దాసత్వమునసుంచరా

• • •

తమదేశమందున
అకలాకలియని
అన్నమడిగిన ప్రజల
ప్రాణముల్‌దీసిన
ఫాసిస్టుహంతకుల
పరిమార్చకున్నచో
ప్రజలనూపీడించరా మనయొక్క
బాధలకు హద్దుండునా

—కామ్రేడ్ జి. కోటయ్య.

నిర్బంధవిధానంపట్ల ఆంధ్రుల అసమ్మతి

23-8-42 మొదలు 31-8-42 వరకు ఏలూరు తాలూకాలో రెండు ఫాసిస్టు వ్యతిరేకప్రచారకదళములు చాలా గ్రామాలలో సంచారము గావిస్తూ బహిరంగసభలను జరిపారు. ప్రభుత్వం నేడు సాగిస్తూన్న నిర్బంధవిధానం జపాను దురాక్రమణకు ఎలా దోహదమిస్తోందో, వివరిస్తూ సభలలో ఉపన్యసిస్తూ ప్రభుత్వవిధానాన్ని ఖండిస్తూ, జాతీయనాయకులను విడుదల చేసి వారితో రాయబారాలు ప్రారంభించవలసిందని బ్రిటిషు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ ప్రతిసభలోను తీర్మానించబడింది. అరాచకచర్యలవల్లగాక జాతీయ ఐక్యతద్వారా జాతీయప్రభుత్వాన్ని ఎలా సాధించగలమో, ఉపన్యాసకులు ప్రతిసభలోను తెలియజెప్పారు.

23 వ తారీఖున వర్షాలు ప్రారంభమవడంవల్ల మెట్టగ్రామాలలో రైతులు సేద్యం ప్రారంభించారు. డెల్టా గ్రామాలలో ముంపులు తొలగించుకోవడంలో రైతులునిమగ్నులైవున్నారు. ఇందువల్ల సభలకు ఎక్కువగా రాజాలకపోయారు. దోసపాడు, పోతునూరు, గుండుగొలను, మల్కీమహమ్మదుపురం, పూళ్ల, కైకరం, భీమడోలు, దెందులూరు, కురెళ్లగూడెం, యీ 9 గ్రామాలలోను సభలకు హాజరైన ప్రజలు దాదాపు 1000 మంది.

దుగ్గిరాల, కొప్పాక, పెదకడియం, కొక్కిరిపాడు, కలవ్రరు, పునుకొల్లు, వసంతవాడ, పెదపాడు, నాయుడుగూడెం, కొత్తూరు - యీ 11 గ్రామాలలోను దాదాపు 400 మంది హాజరయారు.

ఒక్కొక్కదళంలో 4 గురు చొప్పున వున్నారు. రెండు దళాలకు దళాధిపతులు కామ్రేడ్స్ అన్నే వెంకటేశ్వరరావు, గారపాటి యుగంధరరావు గారలు.

భల్లుఖానుడు పాలెం

28-8-42 వ తేదీని పైగ్రామంలో యువకులు, రైతులు మొత్తం 100 మంది జాతీయ, ఎఱ్ఱజండాలతో పెద్దఊరేగింపుజరిపిరి. కామ్రేడ్ ఎన్. సాంబయ్యగారి అధ్యక్షతను బహిరంగ సభ జరిగింగి. సభకు 200 మంది వచ్చారు. కామ్రేడ్ పెద్ది సింగయ్య గారు బుర్రకథ చెప్పారు. సభలో ప్రభుత్వ నిర్బంధ విధానాన్ని ఖండిస్తూ జాతీయ నాయకులను విడిచిపెట్టి జాతీయ ప్రభుత్వాన్నినిర్మించాలని కోరుతూ, ఏకగ్రీవంగా తీర్మానించ బడింది. జాతియైక్యతకై అన్ని రాజకీయపక్షములు పూనుకో వలసిందనికోరుతూ మరొక తీర్మానం మోదింభబడింది.

గరికపాడు

29 వ తేదీన పై గ్రామంలో కామ్రేడ్ ముక్తినూతలపాటి లక్ష్మీనారాయణగారు ప్రస్తుత నిర్బంధ విధానాన్ని ఖండిస్తూ యువకుల సభలో వుపన్యసించారు. వెంటనే జాతీయ నాయకుల్ని విడిచిపెట్టి జాతీయ ప్రభుత్వాన్ని నిర్మించవలసినదిగా సభలో తీర్మానించబడింది.

ఊటుకూరు

కోవూరు తాలూకా ఊటుకూరు గ్రామ యువజనసంఘము 29-8-42 వ తేదీన సమావేశమై, కమ్యూనిష్టులను, యితర ఫాసిస్టు వ్యతిరేకులను వెంటనే విడుదల చేయవలసిందనీ, దేశంలోనిర్బంధ విధానాన్ని నిలుపుచేసి, జాతీయ ప్రభుత్వ నిర్మాణంకొరకు అన్ని రాజకీయ పార్టీలతో సంప్రతింపులు చేయవలసిందనీ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ తీర్మానించారు.

నందిగామ

గత నెల 31 వ తేదీన నందిగామ గ్రామ మహిళాసంఘం ఎం. రంగనాయకమ్మ గారి అధ్యక్షతక్రింద సమావేశమైనది. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను గురించి గుంటుపల్లి సరస్వతమ్మగారు, అయ్యదేవర స్వరాజ్యలక్ష్మిగారు ఉపన్యసించారు. ప్రభుత్వ నిర్బంధ విధానాన్ని ఖండిస్తూ, కాంగ్రెసు నాయకుల విడుదలనుకోరుతూ తీర్మానాలు చేయబడ్డాయి.

పెదపాడు

మద్రాసు కమ్యూనిస్టు కుట్రకేసులో శిక్ష విధించబడి, రైలులోనుంచి పారిపోయి తిరిగి నేడు మద్రాసు ప్రభుత్వం వారంటును ఉపసంహరించు కొన్నందున బయటికి వచ్చిన కామ్రేడ్ హనుమంతరావుకు 31 వ తారీఖున పెదపాడులో స్వాగతం యివ్వబడెను. సభకు కామ్రేడ్ గుత్తా మాణిక్యాలరావు అధ్యక్షత వహించాడు. సభలో జాతీయ నాయకుల్ని విడుదల చేసి జాతీయ ప్రభుత్వాన్ని యేర్పరచాలని ప్రభుత్వాన్ని హెచ్చరించుతూ తీర్మానాలు చేయబడ్డాయి. ప్రస్తుత నిర్బంధవిధానం తీవ్రంగా ఖండించబడింది.

ఏలూరు.

1-9-42 వ తేదీని ఏలూరుతాలూకా యువజనసంఘ కార్యనిర్వాహకవర్గం కామ్రేడ్ గారపాటి యుగంధర్‌గారి అధ్యక్షతను సమావేశమై, సామ్రాజ్యవాదపు నిర్బంధ విధానాన్ని ఖండిస్తూ, యువకులను అరాజక చర్యలకు పోవద్దని హెచ్చరిస్తూ తీర్మానించింది.

నందిగామ తాలూకా

జాతీయనాయకులు అరెస్టు అయినప్పటినుంచీ 21 వ తేదీ వరకు నందిగామ, జగ్గయ్యపేట, వీరులపాడు, మాచినేనిపాలెం, కంభంపాడు, చింతలపాడు, కమ్మవారిపాలెం, పల్లగిరి, కంచకచర్ల, గ్రామాలలో నిరసనసభలు జరిగాయి. మొత్తం 3000 మంది సభలకు హాజరైరి. కామ్రేడ్స్ పి. సుందరం, ఎస్. వీరభద్రరావు, కె. ఎ. రాఘవయ్యగారలు యీ సభలో ఉపన్యసించారు.

చందర్లపాడు

ఈ గ్రామంలో 19-8-42 న జరిగిన బహిరంగసభకు 1000 మంది ప్రజలు వచ్చారు. ములుగు భద్రయ్యగారు సభాధ్యక్షులు. ప్రభుత్వ నిర్బంధ చర్యలను నిరసించుతూ సభ్యులు తీర్మానించారు.

ఈడుపుగల్లు - గాంధీనగర్

ఈడుపుగల్లు సమీపమున గల పైగ్రామంలో 28 వ తేదీని షేక్ అల్లీసాహెబుగారి అధ్యక్షతక్రింద బహిరంగ సభ జరిగింది. 150 మంది హాజరయారు, జాతీయనాయకుల విడుదలను, జాతీయైక్యతను, కోరుచు తీర్మానములు చేయబడ్డాయి.

ఈడుపుగల్లులోకూడా 28 వ తారీఖున కంభంపాటి వెంకటరత్నంగారి అధ్యక్షతక్రింద బహిరంగసభ జరిగింది. సభకు 400 మంది వచ్చారు. పైతీర్మానాలయందలి విషయములపై పలువురు వుపన్యసించారు.

గంగూరు

29 వ తారీఖున షేక్ బడేసాహెబుగారి అధ్యక్షతను బహిరంగసభ జరిగింది. 250 మంది సభకు వచ్చారు. ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండిస్తూ, జాతీయనాయకుల విడుదలను కోరుచు, తీర్మానాలు చేయబడెను.

తణుకు

తణుకు విద్యార్థిసంఘ యాజమాన్యాన యీ నెల 1వ తేదీని జరిగిన బహిరంగసభలో జాతీయ నాయకుల విడుదలను, జాతీయైక్యతను, జాతీయ ప్రభుత్వాన్ని, కోరుతూ తీర్మానించబడెను.

మారుటేరు

2 వ తేదీని జరిగిన విద్యార్థులసభలో కామ్రేడ్ పి. పట్టాభిరామారావు ప్రభుత్వ నిర్బంధ చర్యలను నిరసిస్తూ ఉపన్యసించాడు.

విజయనగరం

2 వ తేదీని పట్టణ విద్యార్థిసంఘ యాజమాన్యాన బహిరంగసభ జరిగింది. ఎన్. అంజనేయులుగారు సభాధ్యక్షుడు. జాతీయ నాయకులను, స్థానిక విద్యార్థి నాయకులను అరెస్టు చేసినందుకు ప్రభుత్వచర్యను ఖండిస్తూ తీర్మానాలు చేయబడెను.

కాళహస్తి

1 వ తేదీని విద్యార్థిసంఘ యాజమాన్యమున, కామ్రేడ్ బాలాజీదాసు అధ్యక్షతను, జరిగిన బహిరంగ సభలో, అరాజకమును రెచ్చగొట్టిన ప్రభుత్వ చర్యను ఖండిస్తూ తీర్మానించబడెను.

ఉరికంబాలకు కాదు - రణరంగానికి!

కయ్యూరు కమ్యూనిస్టుల వాంఛ

ఉరిశిక్ష విధించబడిన కయ్యూరు కమ్యూనిష్టు యువకులు నలుగురూ తమ పార్టీ నాయకుడైన పి. సి. జోషీకి యీక్రింది లేఖను పంపియున్నారు.

ప్రియమైన కామ్రేడ్ జోషీ,

కమ్యూనిష్టుపార్టీపై నిషేధం తొలగించబడిన వార్తవిని మేము సంతసించాం. ఇంతేకాకుండా, మా కామ్రేడ్స్ అందరూ ప్రజలమధ్య తమతమ స్థానాలలో తిరిగి ప్రవేశించి పనిచేయబోతున్నారని విని మేము ఆనందిస్తున్నాం. గత కొద్ది సంవత్సరాలుగ మీ నాయకత్వంక్రింద ఉత్సాహంతో పనిచేయగల్గడం మా అదృష్టం. భారతకమ్యూనిష్టులు జాతీయైక్యతను జయప్రదంగా సాధించి, మన ప్రాచీన మాతృభూమిని ప్రమాదాన్నుంచి రక్షించగల్గుతారని మేము విశ్వసించుతున్నాం. దేశమంతటా మా విడుదలకై జరిగే ఆందోళన మాకు ఉత్సాహాన్ని, ధైర్యాన్నీ, యిస్తోంది. మాయందు పార్టీ, ప్రజలు, నుంచిన విశ్వాసాన్ని మా బొందిలో ప్రాణం వున్నంతవరకు వమ్ముచేయమని హామీ యిస్తున్నాం. ప్రజాందోళనయొక్క ఫలితంగా మా ప్రాణాలు రక్షించబడితే, ఎక్కడికి వెళ్లమని మీరు ఆజ్ఞాపిస్తే అక్కడికి మేము వెళ్ళడానికి సిద్ధం, ఏపని మాకిస్తే దానిని మేము చేసితీరుతాం. ప్రాణాలమీద ఆశపెట్టుకొని ఎలాగో ఒకలాగు బ్రతకడమే మాఆశయం కాదు. ఫాసిస్టురాక్షసుల బారినుండి మన మాతృదేశాన్ని రక్షించడానికి మేము మాప్రాణాలను త్యాగంచెయ్యాలని ఉవ్విళ్ళూరుతున్నాం. సాధ్యమైనంత యెక్కువమంది శత్రువుల్ని మేము చంపాలని కుతూహల పడుతున్నాం. అయితే అందుకు మేము నోచుకోలేదు. శత్రువుయొక్క కుటిల పన్నాగాలను భగ్నంచెయ్యాలని మేము ఉవ్విళ్లూరుతున్నాం. ఆ అవకాశం మాకిచ్చబడలేదు. ఈవిధంగా చావడమే మాకు నిరాశను కల్గిస్తోంది. సైన్యంలో ఆత్మహత్యా దళాలను యేర్పరచడానికి సైన్యాధికారులు ఆలోచిస్తూన్నట్లయితే, ఇట్టిపనికి మేము అర్హులమని మీఅభిప్రాయమైనట్లయితే, దానిని మేము కమ్యూనిష్టుల ఉత్సాహంతో ఆహ్వానించుతాం.

విప్లవాభి వందనాలతో,

మదత్తిల్ అప్పు, కున్హంబు నాయర్,
చిరుక్కన్ను, అబూబేకర్.

• • •

ఉరికంబాలపై కంటె యుద్ధరంగంలోనైనా వీర మరణానికి సంసిద్ధులైయున్న కయ్యూరు శిక్షితులను ఉరికంబాల నుంచి కాపాడుకోవడం ప్రజల కర్తవ్యం. దేశం అంతటా వీరి విడుదలకై తీవ్రమైన ఆందోళన సాగుతోంది. మీ గ్రామంలోవి ప్రజలకు వీరెవరో తెలియజేశారా? వీరిని ఉరికంబాలనుంచి రక్షించడం యెందుకో ప్రజలకు బోధించారా? ఈ క్రింది గ్రామాలలో తెలియ జేశారు.

గణపవరం, ఈడుపుగల్లు, తుందుర్రు, భల్లుఖానుడుపాలెం, పెదపాడు, ఏలూరు, విజయనగరం.

గణపవరం, తుందుర్రు గ్రామాలలో ప్రజల సంతకాలతో గవర్నరుకు మహజరు పంపబడింది. పెదపాడులో గవర్నరుకు తంతి నిచ్చారు. ఇంకా యీ క్రింది గ్రామాలనుంచి మహజర్లు మద్రాసు ప్రభుత్వానికి పంపబడ్డాయి. అచ్చంపేట, వేల్పూరు, తాళ్లూరు, రెంటపాళ్ళ, సత్తెనపల్లి, మాదల, వడ్డవల్లి, పణిదెం, పరస, తాళ్ళూరు (పరస), లింగాపురం, పెదకూరపాడు.

యం. యస్. యం. రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ గుంటకల్ బ్రాంచి ఆర్గనైజరు కామ్రేడ్ బి. సీతారాంగారు యీ క్రిందివార్తను పంపుతున్నారు.

ఆగష్టు 27 వ తేది రాత్రి మస్తానప్ప అనే పేరుగల ఇంజన్ క్లీనరు జ్వరంతో బాధపడుతూ పనికి వెళ్లాడు. విశ్రాంతి కొరకు కాస్తఒళ్లు వాల్చాడు. రాత్రి డ్యూటీ షెడ్ టర్నరు ఎందుకు పడుకున్నావని అడిగినప్పుడు మస్తానప్ప తన అవస్థ చెప్పుకున్నాడు. అయినప్పటికి 'నీకు పొగరెక్కి పడుకున్నావు' అని తిట్టుతూ తన అసిస్టెంటు షంటరు సహాయంతో ముఖంపైకొట్టాడు. మస్తానప్ప కుడికన్నుపై తీవ్రంగా దెబ్బ తగిలింది. ఆసుపత్రికి చేర్చారు.

ఉదయం (28 వ తేది) టిక్కెట్లు వేయునప్పుడు కార్మికులకీ వార్త తెలిసింది. చాలా ఆందోళన పడ్డారు. కార్మికు లందరు ఐక్యతతో షెడ్‌కు వెళ్లి పనిముట్లను తాకలేదు. పనిఆగిపోయింది.

ఇది షెడ్‌టర్నరు, అతని అసిస్టెంటు చేసిన అమానుషచర్యపట్ల అసమ్మతిఅనిన్నీ, కాళ్లమీద తీవ్రమైన శిక్షణాచర్య తీసుకొనేంతవరకు పనులు చేయముఅనిన్నీ, లోకోఫోర్‌మన్‌కు తెలియజేశారు. అతను డి. టి. యస్. పి. తో ఫోనులో మాట్లాడి వాళ్లిద్దరిని సస్పెండు జేస్తామని హామీయిచ్చాడు. తర్వాతఅందరు పనిలో ప్రవేశించారు.

గుంటకల్ బ్రాంచి యాజమాన్యాన 28 వ తేదీ ఉదయం 11 గంటలకు లోకోషెడ్డువద్ద సభజరిగింది. కామ్రేడ్ యం. ముత్తుస్వామి గారు అధ్యక్షతవహించారు. 500 కార్మికులు సభకు వచ్చారు.

షెడ్‌టర్నరు, షంటరుల అమానుషచర్యపట్ల అసమ్మతిప్రకటిస్తూ, వీరిపై వెంటనే చర్యతీసుకోవాలని పై అధికార్లను కోరుతూ తీర్మానం చేయబడింది.

[ఇట్టి దౌర్జన్యాలు యిక జరుగకుండా చూడవలసిన బాధ్యత రైల్వే అధికారులది. కార్మికులు చూపిన ఐక్యతకు, ఓర్పుకు వారిని అభినందిస్తున్నాము. సం. వ.]

నెల్లూరు మునిసిపల్ స్కావెంజర్ల సమ్మె

4 నెలలనుండి ఇచ్చట స్కావెంజర్లకు చైర్మను ఒకవర్తకుని చేత అడ్వాన్సుగా 3 రూ॥ బియ్యం, చిల్లరసామానులు యిప్పిస్తున్నారు. సెప్టెంబరు 1 వ తేదీని అదేరకంగా చీట్లుతీసుకొనుటకుగాను శానిటరీ యినస్పెక్టరువద్దకుపోగా 1 రూ కంటె ఎక్కువ యిచ్చుటకు వీలుకాదని చెప్పాడు. అనుకున్న ప్రకారం యివ్వవలసినదే అని స్కావెంజర్లు అడిగారు. ప్రయోజనం లేక పోయింది. స్కావెంజర్లంతా పనికి పోవడం మానేశారు.

తదుపరి 2 వ తేదీన 2 గంటలకు జిల్లాకలెక్టరుగారు వర్కర్లను పిలిపించి, వారికోరికల్ని తెలుసుకొని 10 రోజులలోపల పరిష్కారం జేస్తానని హామీయివ్వగా 3వ తేదీ వుదయంనుండి స్కావెంజర్లు తమ పనులకు మామూలుగా పోయారు.

రాజమండ్రి మునిసిపల్ వర్కర్సు యూనియన్

"సెప్టెంబరు 1 వ తారీఖున రాజమండ్రి మునిసిపల్ అధికారులు రబ్బిష్‌లారీ తగ్గిస్తూ ఇంతవరకు దానిమీద పనిచేయు 9 గురు కార్మికులను, ముందు నెలరోజుల నోటీసు లేకుండా పనినుంచి తొలగించారు. ఈ సమస్యపై సమ్మె చేయడానికి ముందు కలెక్టరు వద్దకు రాయబారాలు సాగించాలని వర్కర్లు తీర్మానించుకున్నారు." అని యం. మంచయ్యగారు తెలియజేస్తున్నారు.

రైతుల కష్టాలు - ప్రభుత్వోద్యోగుల నిర్లక్ష్యం

కామ్రేడ్ జి. రామశాస్త్రినాయుడు గూడెం (ఏలూరు తాలూకా) నుండి వ్రాసినది.

నాయుడుగూడెం గ్రామంలో ఆగష్టు 30 వ తేదీన బీదరైతులకు చెందిన 300 ఎకరాల వరిపైరు మునిగిపోయింది. ఈ పొలానికి దిగువను పెద్దభూస్వాములు వేయించిన గట్టును తెగగొట్టితే గాని మురుగునీరు ప్రవహించి పైరు రైతులకు దక్కదు. ఇల్లా చేయకపోతే నష్టపడేది 100 మంది బీదరైతులు.

ఈ గట్టు వేసినతరువాత పంటపండక 3 సంవత్సరాలు గవర్నమెంటు ఈ భూమికి శిస్తురిమీషను యివ్వవలసి వచ్చింది.

ఈ భూమి అంతా నిరుపేద రైతులది. నాయుడు గూడెం, పెదపాడు, ఖాజీ గూడెం, వీరమ్మగుంట గ్రామాల రైతులు అన్నికులాల వారూ ఇందులో వున్నారు.

ఈ విషయంలో రైతులందరూ కలిసి ప. గో. జిల్లా కలెక్టరుగారికి ఒక పిటీషను పెట్టుకున్నారు. కామ్రేడ్స్ అన్నే వెంకటేశ్వరరావు, జి. రామశాస్త్రి గార్లు రైతులందర్ని వెంటబెట్టుకొని 8 మైళ్లదూరంలోవున్న యేలూరుకు వర్షంలో కాలి నడకను వెళ్ళారు.

అందరూ కలిసి జిల్లా కలెక్టరు బంగళాకు వెళ్ళితే తానిపుడు రావడానికి తీరిక లేదనీ, డిప్యూటీ కలెక్టరు గారి దగ్గరకు పోయి చెప్పుకోవలసిందనీ కలెక్టరుగారు చెప్పారు. సరేనని అందరూ డిప్యూటీ కలెక్టరుగారి దగ్గరకు పరుగెత్తారు. ఆయన ముందర కసిరి కొట్టి, చివరకు రెవిన్యూ యినస్పెక్టరు వద్దకు పోవలసిందని సలహా యిచ్చారు. రైతు లందరూ అచ్చటికి వెళ్లారు. రెవిన్యూ యినస్పెక్టరుగారు తరువాతరోజు సాయంకాలానికి రావడానికి ప్రయత్నిస్తాననీ, ఈలోగా విచారణచేసి సిద్ధంగా వుండవలసిందని కరణంగారితో చెప్పవలసినదిగా రైతులకుచెప్పి వారిని సాగనంపారు.

ఇప్పటికే మూడు వంతులు పైరులు కుళ్ళిపోయినవి. ఒకవైపు ఎక్కువ పంటలు పండించాలి అనే వుద్యమాన్ని ప్రోత్సహిస్తూ, మరోవైపు పైరు కుళ్ళిపోతూంటే విచారించకుండా ఊరుకోవడం చాలా విచిత్రముగా వుంది. ప్రభుత్వోద్యోగుల నిర్లక్ష్యం గర్హింపతగినవి. చాలా విచిత్రంగా వుంది. ప్రభుత్వోద్యోగుల నిర్లక్ష్యం గర్హింప తగినది.

★ వివిధవార్తలు ★

బొడ్డపాడు గ్రామరైతుల సమావేశం

సెప్టెంబరు 1 వ తేదీన రైతుసంఘ యాజమాన్యాన వూరేగింపు జరిపి, 300 మంది రైతులు కామ్రేడ్ వై. వెంకటేశ్వరరావుగారి అధ్యక్షతను సభజరిపారు.

పారిశ్రామిక సరుకులకు గరిష్టధరలున్నూ రైతులు పండించే ముడిసరుకులకు కనీసధరలున్నూ ఏర్పరచి ధరలకంట్రోలు చేయవలసినదిగా ప్రభుత్వాన్ని కోరుతూ ఒక తీర్మానం, జమీందారీ గ్రామాలలో బి. రిజిష్టరుదాఖలా భూములనుకూడ రైతులకు సాగుకు యిచ్చేలాగున జమీందారులపై ప్రభుత్వం వత్తిడి తేవలసినదిగా మరో తీర్మానం చేయబడినది.

యువజన సంఘాలు

ఆగష్టు 22 వ తేదీన సత్తెనపల్లి తాలూకా మాదల గ్రామంలో సత్తెనపల్లి, నరసరావుపేట, గుంటూరు తాలూకాల యువజనసంఘ అధ్యక్ష కార్యదర్శుల సమావేశం జరిగింది. మొత్తం 30 మంది హాజరయ్యారు.

కామ్రేడ్ యం. బసవ పున్నయ్య సందేహాలకు సమాధానా లిచ్చాడు.

ప్రస్తుత జాతీయ, అంతర్జాతీయ సమస్యలను సమగ్రంగా చర్చించారు.

సాయంత్రం బహిరంగసభ జరిగింది. రాత్రి రామకోటీశ్వరరావు, మీరా, సత్యం సెట్టుచే రష్యా-జర్మనీ యుద్ధం బుర్రకథ చెప్పబడింది.

• • •

ఆగష్టు 25 వ తేదీన తెనాలి యువజన సంఘ ఆఫీసులో తెనాలి, బాపట్ల, ఒంగోలు, రేపల్లె తాలూకా, యువజన సంఘ అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం జరుపబడింది. 16 మంది వర్కర్సు వచ్చారు.

ఈ పై రెండు సమావేశాల్లో ప్రభుత్వ నిర్బంధ విధానాన్ని విమర్శిస్తూను, దేశ నాయకులను సత్వరం విడుదల చేయాలనియు, యిందుకోసం యువకులు పూర్తి ఆందోళన చేయాలనియు, జిల్లాలో దహనమైన రైల్వే స్టేషన్లు, చెడగొట్టబడిన బ్రిడ్జీలు ప్రభుత్వం తిరిగి నిర్మించాలనియు తీర్మానాలు కావింపబడినవి.

• • •

ఆగష్టు 30 వ తేదీన రేపల్లె తాలూకా యువజన సంఘ ఆఫీసులో ఆ తాలూకా వివిధ గ్రామ యువజన సంఘాల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం జరిగింది. 25 మంది హాజరైనారు.

ప్రస్తుత పరిస్థితుల్లో యువజన సంఘాలు చేయవలసిన పనిని గూర్చి చర్చలు జరిగి నిర్ణయాలు చేయబడ్డవి.

కృష్ణాజిల్లా యువజన సంఘం

2-9-42 వ తేదీన 12 గంటలకు జిల్లా యువజన సంఘ వర్కింగు కమిటీ సమావేశమై యీ క్రింది తీర్మానములను ఆమోదించిరి.

(1) అక్టోబరు 10 వ తారీఖు లోపల నూతన సభ్యులను చేర్పించి తాలూకా స్పోర్ట్సు, మహాసభలు, 20 వ తా॥ లోగా జరిపించవలెననియు తాలూకా పట్టణ సంఘమువారిని హెచ్చరించుచున్నారు.

(2) ఆటలలో కొంతమంది నిపుణులను తయారు చేయుటకు జిల్లాసంఘ ఆధ్వర్యాన పామర్రులో స్పోర్ట్సు ట్రయినింగు క్యాంపు ఏర్పాటు చేయుటకు నిర్ణయించి, దానికి కావలసిన ఏర్పాటులన్నీ చేయుటకు తాతినేని సూర్యప్రకాశరావుగారిని నియమించిరి.

(3) కాంగ్రెసునాయకులను విడుదల చేయాలని కోరుతూ, మహదేవ దేశాయి మరణానికి సానుభూతి చూపుతూ తీర్మానించిరి.

గుంటూరు కాలేజీల విద్యార్థుల సమ్మె

ఆగష్టు 29 వ తేదీన పట్టణ విద్యార్థి సంఘ కార్యదర్శి ఎస్. టి. రంగాచారి, సి. హెచ్. వి. కామేశ్వరరావు అనే మరో విద్యార్థి పోలీసులచే అరెస్టు చేయబడ్డారు.

ఆగష్టు 31 వ తేదీన ఈ అరెస్టులకు అసమ్మతి తెలియజేస్తూ అన్ని కాలేజీల విద్యార్థులు శాంతియుతముగా సమ్మె చేశారు.

యస్. టి. రంగాచారి స్థానే కె. వి. బసవయ్యగారు కార్యదర్శిగా యెన్నుకోబడ్డారు.

అరెస్టులు

కర్నూలు జిల్లా

జిల్లా కమ్యూనిష్టు పార్టీ కార్యదర్శి కామ్రేడ్ వి. బాపయ్యగారిని, ఆర్గనైజరు కామ్రేడ్ సి. పుల్లారెడ్డి గారిని పోలీసులు అరెస్టు చేశారు. వారి యిండ్లను సోదాచేసి, కొంత వాఙ్మయాన్ని తీసుకెళ్లారట. కామ్రేడ్ కె. వి. కృష్ణమూర్తి, ఆర్. తిప్పారెడ్డిగార్ల యిండ్లు కూడా సోదాచేసి, కొంత వాఙ్మయం తీసుకెళ్లారట. 2 నెలలవరకు కమ్యూనిష్టులుగాని, విద్యార్థి సంఘం వారుగాని, సభలు, ఊరేగింపులు జరుపరాదని 144 వ సెక్షన్ కర్నూలులో జారీ చేయబడింది.

గుంటూరుజిల్లా

గుంటూరు జిల్లా:— నరసారావుపేటలో 6 వ తేదీని కామ్రేడ్స్ పి. వి. శివయ్య, శ్రీ గిరిరాజు సత్యనారాయణ గారలు అరెస్టు చేయబడ్డారు.

యూరప్‌లో

★ రెండోరంగం ప్రారంభించలేమా?

రష్యాపై జర్మనీ దండెత్తిన నాలుగోనాడే నేనిలా వ్రాశాను. "ఇప్పుడే మనం జర్మనీపై దెబ్బ కొట్టాలి. ఇంతకంటె గొప్ప అవకాశం మనకి లభించదు." నేటికి కూడా రష్యన్ ప్రజలు అట్టి అవకాశాన్ని మనకి కలుగజేస్తున్నారు. అందుకు వారి ధైర్యసాహసాల్ని, సహనశక్తిని అన్నిటికంటె ఎక్కువగా వారి మిలిటరీ, రాజకీయనిపుణతను మనం అభినందించాలి. నాజీలను ఓడించడానికి యుద్ధాన్ని, అంతమొందించడానికి ఇంతకంటె ఆశాజనకమైన సమయం దొరకదు.

రష్యాకు సాయం చేయడానికి, ఈయుద్ధంలో రష్యన్ ప్రజలొక్కరే భారమంతా మోయనక్కరలేకుండా, మనవంతు బాధ్యతను మనం నెరవేరుస్తున్నామని రుజువు చేయడానికి, నాజీ ఆక్రమితదేశాలలో తిరుగుబాటుకు సిద్ధంగా వున్న ప్రజలకు ప్రోత్సాహమివ్వడానికి, జర్మను ప్రజలు కళ్ళుతెరచేటట్లు చేయడానికి, రెండవ యుద్ధరంగమంటే భయపడుతున్న నాజీ మిలిటరీ నాయకులకు పక్కలో బల్లెపుపోటు పొడవడానికి మనం యూరప్‌లో రెండవరంగం ప్రారంభించాలి. ఇంతేకాదు. రష్యన్ యుద్ధం మూలాన జర్మనీ ఆంతరంగికంగా చాల బలహీనపడుతోంది. ఇట్టి సమయంలో రెండవ రంగం ప్రారంభించితే నాజీలు ఈ ధాటికి ఆగలేరు. నాజీప్రభుత్వం కూలిపోతే అదివరకేదడదడలాడుతూన్న ముసోలినీపరిపాలన దానంతటదే కూలిపోతుంది. సాయుధప్రపంచఒత్తిడిని జపాను ఒక్కటీ ఎదుర్కోవలసి వస్తుంది.

ఈ వాదనలు అంతా అంగీకరిస్తున్నారు. రెండవరంగం ఆరంభించాలని ఒప్పుకుంటారు కాని ఇప్పుడే ప్రారంభించాలా లేదా అనే ప్రశ్నదగ్గరే అభిప్రాయభేదా లున్నాయి.

ఒకఛాన్సు పోయింది :

క్రిందటిసంవత్సరం సెప్టెంబరు నెలలోనే రెండవరంగం ప్రారంభించివుంటే చాలబాగుండేది. ఈ యథార్థాన్ని ఈ మధ్యను హిట్లరు గోరింగుల ఉపన్యాసాలే రుజువు చేశాయి. రష్యాలో క్రిందటిచలికాలంలో జర్మన్ సైన్యాలు కోలుకోలేనంత దెబ్బతిన్నాయి. వారి ధైర్యం చెడింది. దీనికి ఉదాహరణ ఈ సంవత్సరం మేనెలాఖరు వరకూ జర్మన్లు తిరిగి దాడి చేయలేకపోవడం. ఈజిప్టులో రోమెల్ ఆలస్యంగా దాడి చేయడం. మనం ఇంకా కాలయాపన చేయడం వలన జర్మనీ కొంత కోలుకుంది. పసిఫిక్‌లో జపాను మనపైన దెబ్బకొట్టింది. మనం ఇంకా మీనమేషాలు లెక్కపెడుతూ కూర్చున్నామంటే జపానుకు చొరవ ఎక్కువ అవుతుంది. హిందూదేశానికి, చైనాకి ఆస్ట్రేలియాకి పెద్ద ముప్పు వాటిల్లుతుంది.

ఆలస్యం కూడదు :

రెండవ రంగం ఆరంభించడానికి యింకా కొంత కాలం వేచి వుండాలనేవారు దానివలని ప్రమాదాన్ని గుర్తించడం లేదు. ఈ ఆలస్యం వల్ల పరిస్థితులు చక్కబడవు సరికదా అపాయం మరింత యెక్కువవుతుంది. అమెరికను ఉత్పత్తి మన ఆయుధ శక్తిని యెక్కువ చేసేటంతవరకూ జాగ్రత్తగా డిఫెన్సు మీదనే వుంటూ వుందామని వారంటారు. ఇంతకంటె ప్రమాదకరమైన జూదం మరొకటిలేదు. అది రష్యా, చైనా, ఇండియాలను గిరిలో పెట్టి జూద మాడటం, అది బ్రిటిషు, అమెరికను ఆయుధ పరిశ్రమలకు కావలసిన ముడి పదార్థాలతో జూదమాడటం. (ఇప్పటికే మనం చాల రబ్బరు,తగరం,నూనెవీటినిపోగొట్టుకున్నాం.) అది మన ఓడలతో జూదమాడటం. (నేడు మనం తయారు చేసే ఓడలకంటె యెక్కువగానేముంచివేయబడుతున్నాయి)అన్నిటికంటె ముఖ్యంగా యీ వేచివుండడ మనే పాలసీ ప్రపంచ స్ట్రాటజీతోనే జూదమాడటం.

భారత ప్రతిఘటన :

లిబియా, ఈజిప్టు, పాలస్టైయిన్, సిరియా, ఇరాక్, ఇరాన్, ఇండియాలలో మనకు కావలసినన్ని సైన్యాలు, ఆయుధాలు పోగుపడి వున్నాయి ఈ సైన్యాలన్నీ సప్లయికోసం మన ఓడలపై ఆధారపడి వున్నాయి. అందుకు తూర్పు ఆఫ్రికా సముద్రం, హిందూ మహాసముద్రం మన కంట్రోలులో వుండాలి. ఈ సప్లయి మార్గాలు శత్రువు చేతిలో పడ్డాయంటే మన సైన్యాలకు, మనకు సంబంధం తెగిపోతుంది. సూయజ్‌గుండా జర్మనీ జపానులు చేయి చేయి అందించుకుంటాయి. దానివల్ల యుద్ధం యింకా కొన్ని సంవత్సరాలు పొడిగింపబడుతుంది. ఈ ప్రమాదం సంభవించకుండా చేయాలంటే ఇప్పుడే మేల్కొవాలి.

నాజీల బలాన్ని చీలదీసి రెండు రంగాలలో వారిని వూపిరిసలుపకుండా చేయాలి. దీనిఅర్థం ఇండియాను రక్షణ లేకుండా వదలివేయడమని కొందరంటారు. అది పొరపాటు. భారతీయులకు వారి దేశాన్ని వారు రక్షించుకునే అవకాశం మనం ఇవ్వడం లేదు. ఇస్తే చైనీయులవలె వారు తమ మాతృభూమిని రక్షించుకోగలరు. భారతీయుల ప్రతిఘటన జపాను శత్రువును నాశనం చేసివేస్తుంది. అటు చైనాప్రజలు జపాను సైన్యాలను ఉక్కిరిబిక్కిరి చేస్తూంటే ఇటు పసిఫిక్‌లో అమెరికా, ఆస్ట్రేలియా సైన్యాలు జపాను స్థానాలను చెదరగొట్టుతూంటే ఇండియా ప్రజలు జపానును ప్రతిఘటించారంటే జపాను ఫాసిస్టులకిక గతియేది ?

అసలుచిక్కులు :

అయితే మనకు చిక్కు ఎక్కడవస్తోంది? మన మిలిటరీ "నిపుణులు" (Experts) అనబడేవారి మూలంగానే వస్తోంది. వీరు చెప్పేదేమిటి ? రెండవరంగం ప్రారంభించాలంటే మనకు చాలా కష్టాలున్నాయంటారు. మనకి డైవ్ బాంబర్లు కావాలనేవారిని ఏమీ తెలియని "అమెచ్యూర్సు" పొమ్మంటారు. మాజినో లైనుకుతిరుగులేదనినమ్మిన ఈ "నిపుణుల"ను, టాంకులను ధ్వంసం చేయడానికి రెండు పౌండర్ తుపాకులు చాలునని చెప్పే ఈ "నిపుణుల"ను, సింగపూర్‌ను భూయుద్ధంతో రక్షించుకోగలమని చెప్పిన ఈ నిపుణులను, రెడ్‌ఆర్మీ కొన్నివారాలకంటె ఎక్కువకాలం నిలబడదనుకున్న ఈ "నిపుణుల"ను మనం ఎట్లా నమ్మగలం ? నామట్టుకు నాకు ఈ నిపుణులు చెప్పే మాటలు నమ్మవలసిన అవసరం ఏమీ కనబడటంలేదు. మన స్ట్రాటజీని నిర్ణయించే మిలటరీ పండితులలో కొందరికి రెండు సంవత్సరాలక్రితం గెరిల్లా పద్ధతులలో ఏమీ ప్రయోజనం కనబడలేదు. 1940 లో ఆస్టర్లీ పార్కులో మేము ప్రజలకు గెరిల్లా ఎత్తులు బోధించేటప్పుడు వీరికది ఎగతాళిగా వుండేది. ఆ పండితు లిప్పుడు కళ్లుతెరిచారు. మన సైన్యాలకి ఇప్పుడు గెరిల్లా పోరాటాన్ని గురించి చెప్పడం ప్రారంభించారు. లిబియాలో ఒకసారి ప్రాయశ్చిత్తం అయాక, రెండు పౌండర్ తుపాకులు టాంకులమీద ఎందుకూ పనికిరావనే సంగతి గ్రహించారు. అందుచేత ఈ "నిపుణుల"ను నేను నమ్మలేను. రెండవరంగం ప్రారంభించడానికి చాలా కష్టాలున్నాయనే వారి వాదన కూడా నే నంగీకరించను. వారింకా పాత యుద్ధపద్ధతులపైననే ఆలోచిస్తున్నారు. నార్వేలో మనం దిగితే మనకి విమానసహాయం వుండదంటారు వారు. మనమూ, నార్వేప్రజలూ కలిసి కొన్ని జర్మను విమానాశ్రయాలు లాగుకొనేంతవరకు కొంత కష్టమే. కాని జపానుకు మలేస్టేట్సులో దొరికినంత సులభంగా మనకి దొరికే విమానాశ్రయాలు కొన్ని నార్వేలో వున్నాయి. మన విమానాలు దిగడానికి వీలుగా వుండే దీవులు కూడా కొన్ని వున్నాయి.

మనం ఫ్రాన్సులో సైన్యాలు దింపడానికి అక్కడ జర్మను సాయుధ సైనిక దళాలున్నాయని, అందుచేత ముందుగా మనం మన సాయుధ దళాలనుదింపలేమనీ, యింకో సాకు చెబుతున్నారు. అయితే జపాను మలయాలో యెన్ని సాయుధ సైనిక దళాలను దింపి దండయాత్ర ప్రారంభించిందని అడుగుతాను. మలయాలో దిగిన కొన్ని వారాల వరకూ వారికి 30 చిన్న టాంకులుతప్ప యేమీలేవు. బర్మాలో మొదట్లో కొన్ని వారాలపాటు జపానుకు విమానాలలో ఆధిక్యత లేనేలేదు. రంగూను పట్టణాన్ని వశపర్చుకున్న తరువాతనే వారు విమానాలను, టాంకులను అధికసంఖ్యాకులుగా తెచ్చి దింపారు. నార్వేలోగాని, హాలండ్‌లోగాని, బెల్జియంలోగాని, ఫ్రాన్సులోగాని మనం అలాగే చేయవచ్చు. కొన్ని స్థానాలు సుళువుగా పట్టుకోవచ్చు. ఆ తరువాత కావలసినంత సాయుధ బలగాన్ని తీసుకువెళ్ళి దింపగలం, మనం చేయవలసినది శత్రుతీరమంతటా టోబ్రూక్ లాంటి స్థానాలు నిర్మించాలి. ఇవి తీరమంతా ఆక్రమించుకోడానికి కాదు. తొందర తొందరగాదాడులుసాగించడానికిఉపకరిస్తాయి. అంతేకాదు మనం దాడి ప్రారంభించగానే శత్రు అక్రమిత ప్రదేశాలలో నాజీ పరిపాలనను అసహ్యించుకుంటూ మనతో సహకారం చేసే ప్రజలందరు గెరిల్లా యుద్ధం సాగించి మనకు తోడ్పడటానికి వారికి విరివిగా ఆయుధాలు సప్లయి చేయాలి. అందుకు అటువంటి స్థానాలు చాలా అవసరం.

మన ఆశయం ఏమిటి ?

రెండవ రంగ ఆశయం యీ రోజుననే సంపూర్ణ విజయం వస్తుందని కాదు. రష్యా రంగంనుంచి కొంత జర్మనుసైన్యాన్ని, విమానబలాన్ని పశ్చిమరంగంలో కూడ పోరాడవలసి

> **టామ్ వింటరింగ్‌హామ్**
>
> ఈయన స్పెయిన్‌లో ఇంటర్ నేషనల్ బ్రిగేడ్‌లో వుండి ఫాసిస్టు ఫ్రాంకోకు వ్యతిరేకంగా పోరాడాడు. ఈ యుద్ధం వచ్చాక "నూతన యుద్ధ పద్ధతులు" (New ways of war) అనే గ్రంథం వ్రాసి ప్రఖ్యాతి వహించాడు. ఇప్పుడు ఇంగ్లండులో హోమ్‌గార్డుకు ట్రయినింగు ఇవ్వడానికి ప్రభుత్వం ఈయనను నియమించింది.

వచ్చేటట్లుచేయడం, రొమెల్‌కు అదనపుసైన్య సమీకరణ లేకుండా చేసి అతని ధాటిని అరికట్టడం, జర్మనులు దేనికైతే భయపడుతున్నారో, అట్టి రెండు రంగాలలో పోరాడకతప్పదనేది వారికి బాగా నాటేటట్లు చేయడం. ఈ పనులు నెరవేర్చడానికి కావలసిన సాధనసంపత్తి మనకి వుంది. ప్రజలలో కూడ మనం రెండవ రంగాన్ని విజయవంతంగా కొనసాగించగలమనే ధైర్యం, ఉత్సాహం కావలసినంత వుంది. మనకు లేనిదల్లా సరియైన మిలిటరీ దృష్టి.

రెండవ రంగం ఆరంభించలే మనేవారు మనకు కావలసిన ఆయుధాలు లేవనీ, వాటిని అవసరం వచ్చినపుడు తీరానికి చేర్చలేమని వాదిస్తున్నారు. అది పొరపాటని నే నంటే నన్ను ఛాందసవాదుడిగా తీసిపారవేస్తారు. ఏమైనా యుద్ధాలను జయించేది మనుష్యులు గాని ఆయుధాలు కాదని నా నమ్మకం. ఆయుధాలు పూరికే పోగుపడి వున్నంతమాత్రాన విజయం చేకూరదు. వున్న ఆయుధాలను సరియైన సమయంలో, సరియైన పద్ధతిలో వినియోగించుకోడంపైననే విజయం ఆధారపడి వుంటుంది. మనకి కావలసినంతమంది మనుష్యులున్నారు. వారందరి నైపుణ్యాన్ని మనం వినియోగించుకోవాలి. వారికి ఆయుధాలు ఇవ్వాలి. రెండవ రంగంలో వుండే చిక్కులన్నీ వారే తీర్చుతారు.

(2 వ పేజీ తరువాయి)

ఈ కాంగ్రెసువాదియొక్క వాదన పైవిధంగాఉన్నట్లు కనపడుతుంది. ఈ పోరాటం మన దేశకంతాన్నే నరికివేస్తుందనీ, జపాను వాళ్లకు మనభూమిని తేలికగాను చౌకగాను ఇస్తుందనీ, ఇతడు మరచిపోతున్నాడు. అసలు సమస్య రష్యాకు సహాయంచేయడమా చేయకపోవడమా అన్నదిగాదు. మన జాతీయ అస్తిత్వాన్నే రక్షించుకొనడమే ఇచటి సమస్య. మన దేశాన్ని సర్వనాశనం నుండి రక్షించుకోవాలంటే, ఈ పోరాటాన్ని ఆపాలి. జపాను దండయాత్రీకులనుండి రక్షించునట్టి, జాతీయ ప్రభుత్వాన్ని సంపాదించునట్టి, నిజమైన ఒకేఒక మార్గాన్ని మనం అనుసరించాలి. ఆమార్గం జాతీయఐక్యత. ఒక్క కమ్యూనిస్టులేగాక ప్రతి దేశభక్తుడూ, అర్జెంటుగా పూర్తిచేయాలిసిన కర్తవ్యం ఇది. రష్యాకు సహాయమా,హిందూదేశానికి స్వాతంత్ర్యమా, ఏదిముందుఅనే ప్రశ్నకానేకాదు. కాకసస్‌లో హిట్లరును ముందుకు రానీయకుండా, నేడు రష్యా అడ్డగించు తోంది. ఆవిధంగా మన పోరాటాన్ని రష్యాయే గావించుతోంది. నాజీ గుంపులను మన దేశానికి దూరంగా నిలబెడుతోంది. ఇతర దేశాలు, మన సరిహద్దులను ఫాసిస్టులనుండిశాపాడి రక్షించుతోంటే, మనం మన దేశరక్షణలను క్రోధోన్మత్తులమై త్వరత్వరగా నాశనం చేస్తున్నాము. ఇదే నా మన కర్తవ్యం।

జాతీయవాంఛకు ప్రపంచ సానుభూతి

* కామ్రేడ్ *
కంభంపాటి సత్యనారాయణ

ఈ నెల రోజులనుంచీ బ్రిటిషు ప్రభుత్వం దేశంలో ప్రవేశపెట్టిన క్రూర నిర్బంధ విధానము, దీనిని యెదుర్కోవడానికి ప్రజలు జరిపే అరాజక చర్యలు, రెండూకూడా ఫాసిస్టు దురాక్రమణకు యెలా సహాయపడతాయో కమ్యూనిష్టులు తీవ్ర ప్రచారం జరుపుతూన్నప్పటికీ, ప్రభుత్వంగాని, కాంగ్రెస్ గాని తమ పంథాలను విడిచిపెట్టడం లేదు. ఇండియా యొక్క సర్వ సేనాని ఆర్చిబాల్డ్‌వావెల్ తన బ్రాడ్‌కాస్టు ఉపన్యాసంలో యిలా చెప్పాడు. "ఇండియాను రక్షించేవారు దేశీయ సమస్యలలో పడి, తగాదాలాడుకొనే రాజకీయవేత్తలు కాదు. శిక్షణలేని బడి పిల్లలుగాని, బాధ్యత లేని తుంటరులుగాని, కాదు ఇండియాను రక్షించేవారు. సుశిక్షితులుగా యుద్ధ రంగాలలో పోరాడే భారత యోధులే దేశాన్ని రక్షించేవారు."

ఇండియాలోనే కాకుండా బ్రిటన్‌లో సహితము, భారత జాతీయ వాంఛను బ్రిటిషు ప్రభుత్వం గుర్తించి, జాతీయ ప్రభుత్వాన్ని నిర్మిస్తేగాని భారతీయులు ఉత్సాహంతోను, జయ ప్రదంగాను, ఫాసిజాన్ని యెదుర్కోజాలరని ప్రజాభిప్రాయం వ్యాపించుతూంటే, వావెల్‌వంటి గడ్డకట్టిన సామ్రాజ్యవాదులు ఈసత్యాన్ని అంగీకరించక ప్రజల సహకారంలేకుండా సైనికులే ఇండియాను రక్షించగలరని ప్రపంచాన్ని నమ్మమంటున్నారు. కాంగ్రెసుయెడల ప్రపంచ ప్రజలకు గల సానుభూతిని తొలగించాలని వావెల్ యొక్క ఉద్దేశం. కాని ఇది నెరవేరదు.

కాంగ్రెసును ఒక్క పోటుతో నాశనం చేయవలెననే ఉద్దేశం భగ్నమై, బ్రిటిషుప్రభుత్వం దేశమంతటా నిర్బంధ విధానాన్ని ఎక్కువ జేస్తోంది. ముఖ్యంగా సాముదాయక జరిమానాలకు అంతులేకుండా వుంది. బీహారు ప్రభుత్వం పాట్నా నగరవాసులమీద 2 లక్షల రూపాయలు, గయ జిల్లాలో రు 1,85,000, పాట్నా జిల్లాలో రు 1,40,000, సరణ్ జిల్లాలో రు 18,000 మొత్తం సుమారు రు 5½ లక్షలు సాముదాయక జరిమానాలు విధించింది. ఇలాగే యు. పి. ప్రభుత్వం 3 జిల్లాలలో రు 53,500, బొంబాయి ప్రభుత్వం 5 గ్రామాల మీద రు 30,000 జరిమానా విధించాయి. మధ్యపరగణాల ప్రభుత్వం 5 జిల్లాలలో రు 1,13,000 విధించింది. అస్సాంలో రు 9,000 విధించబడింది.

ఈవిధంగా సాముదాయక జరిమానాలు ప్రభుత్వవిధానంలో ఒక భాగమైపోయింది. సర్వవ్యాపితమైన అరాజకచర్యలను అణచడానికి యిది ఏమాత్రము ఉపయోగించకపోగా, ఎక్కువ చేస్తుంది. ప్రజల ప్రతీకారదీక్ష తీవ్రమవుతుంది. కొన్ని ప్రదేశాలలో ముస్లిం ప్రజలను విడిచిపెట్టి యితరులపైననే యీ జరిమానాలు విధించడంవల్ల హిందూ-ముస్లిం వైషమ్యాలు, కలహాలు, బయల్దేరుతాయి. దేశంలో జాతీయ శక్తులను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వపు కుట్ర యిది.

బ్రిటిషు ప్రభుత్వం ప్రజలపై వినియోగిస్తూన్న ఆయుధాలు యింకా వున్నాయి. లక్నో జిల్లా కలెక్టరు కొన్ని విపరీతమైన ఉత్తరువులు జారీ చేశాడు. ఏ గ్రామాలగుండాగాని, ఏ గ్రామాల సమీపంలోగాని, రైల్వే పట్టాలు, రోడ్లు, టెలిగ్రాఫ్ తీగలు వేయబడి వుంటాయో ఆ గ్రామ ప్రజలు వాటిని సంరక్షించడములో స్థానికాధికారులకు తోడ్పడాలి. ఇలాగే 3 మైళ్ళ దూరంలో వుండే ప్రభుత్వ కార్యాలయాలను గ్రామస్థులు కాపాడాలి. ప్రభుత్వపు ఆస్తికి నష్టం కలుగకుండా చూడవలసిన బాధ్యత ఆయా మొహల్లాలలోని ప్రజలదేననీ, వారా విధంగా చేయకపోతే ఆ ప్రజలే అందరికంటె యెక్కువ బాధ పడవలసి యుంటుందనీ కూడా లక్నో జిల్లా కలెక్టరు హెచ్చరించాడు. ఏయే గ్రామాలలో అరాజక చర్యలు జరుగుతాయో ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వానికి తెలియపరచకపోతే కూడా సాముదాయక జరిమానా విధించ వచ్చునని ప్రభుత్వపు టుత్తరువు. ఈ ఉత్తరువుల ఫలితం యేమవుతుందంటే ప్రజలలో ప్రజలు ద్వేష భావాలతో దొమ్మీలకు దిగి, మళ్ళీ పోలీసుల చేతుల్లోనే పడవలసి వస్తుంది.

అరాజక చర్యలలో యెక్కువగా పాల్గొంటూన్న విద్యార్థులుకూడా ప్రభుత్వ నిర్బంధ విధానానికి యెక్కువగా గురి అవుతున్నారు. మద్రాసులో యిద్దరు లయొలా కాలేజీ విద్యార్థులు రైళ్లను పడగొట్టే ప్రయత్నంలో వున్నారని చెరి ఒకరికి 15 కొరడా దెబ్బల వంతున శిక్షవిధించారు. ముందుగా వారు క్షమార్పణ కోరినప్పటికీ, యీ శిక్ష విధించబడింది. సమ్మె చేస్తున్న విద్యార్థులందరూ వెంటనే కాలేజీలలో ప్రవేశించకపోతే వారి పేర్లు కొట్టివేయబడతాయని మద్రాసు ప్రభుత్వం, కాలేజీ ప్రిన్సిపాల్స్, వార్నింగు లిచ్చారు. దానితో మద్రాసు కాలేజీలలో విద్యార్థులు తిరిగి ప్రవేశిస్తున్నారు. సమ్మెను విరమిస్తూ తీర్మానాలు చేసుకుంటున్నారు.

ప్రభుత్వ నిర్బంధవిధానాన్ని ఖండిస్తూ తీర్మానించినందుకు పాలకొల్లు మ్యునిసిపాలిటీని, తూ. గోదావరి, నెల్లూరు జిల్లా బోర్డులను, మద్రాసు ప్రభుత్వం సూపర్సీడ్ చేసి ఆ స్థానిక సంస్థల స్వల్పాధికారాలను కూడా భగ్నం చేసింది.

బ్రిటిషు ప్రభుత్వపు యీ నిర్బంధవిధానాన్ని ఎదుర్కోవడానికి ప్రజలు యింకా రెచ్చిపోతున్నారు. బీహార్‌లో పోలీసు ఉద్యోగులను, సైనికులను, ప్రజలు చంపివేస్తున్నారు. కొందరిని బ్రతికివుండగా దహనం చేస్తున్నారు. ఒరిస్సాలో ప్రజలు తమ నాయకుల్ని విడుదల చేయించుకోవడానికి పోలీసులపై తిరుగుబాటు చేస్తున్నారు. సంయుక్త పరగణాలలోను, మధ్య పరగణాలలోను పోలీసుస్టేషన్లను, యితర ప్రభుత్వ కార్యాలయాలను తగలపెడుతున్నారు. రైలుపట్టాలు తీసివేస్తున్నారు. టెలిగ్రాఫ్ తీగలు తెంచివేస్తున్నారు.

ఈ విధంగా రెచ్చగొట్టబడిన ప్రజలపై ఆ యా ప్రదేశా

మన రాజకీయాలు

లలో పోలీసులు, మిలిటరీ, తుపాకులు కాల్చడం జరుగుతోంది. వందలాదిగ ప్రజలు ప్రాణాలను గోల్పోతున్నారు.

మరోవంక బ్రిటిషు ప్రభుత్వం బానిస భారత దేశపు యుద్ధ కృషిని స్తుతిస్తూ ప్రకటనలు గావించుతోంది. యుద్ధపు మొదటి సంవత్సరంలో ఇండియా రు. 83 కోట్ల విలువగల యుద్ధ సామగ్రిని, రెండవ సంవత్సరంలో రు 165 కోట్ల విలువగల వాటిని, మూడవయేట రు 365 కోట్ల విలువగలవాటినీ సప్లయి చేసిందనీ, యిప్పుడు నెలకు రు 20 కోట్ల విలువగల సామగ్రిని సప్లయి చేస్తూన్నదని ప్రభుత్వ ప్రకటన. కాని దేశంలో జాతీయ ప్రభుత్వమే వుంటే, ఇంతకంటె యింకా ఎన్ని రెట్లు సప్లయి చేసివుండేదో!

కాంగ్రెసును అణచివేసి కాంగ్రెసు ప్రతికూల కూటమిని దేశంలో యేర్పరచాలనే ప్రభుత్వ పన్నాగం క్రమక్రమముగా భగ్నం అవుతోంది. ప్రభుత్వమే ప్రపంచ ప్రజ లందరికీ దూరమైపోతోంది. బ్రిటిషు ప్రభుత్వపు నిర్బంధ విధానాన్ని ఖండిస్తూ, జాతీయ ప్రభుత్వాన్ని కోరుతూ, యు. పి. రాష్ట్ర వాణిజ్య మండలి, కాశ్మీర్ నేషనల్ కౌన్సిల్, ఒరిస్సా స్వరాజ్య పార్టీ, అఖిల భారత ముస్లిం వాణిజ్య సంఘం, మద్రాసు క్రిస్టియన్ కౌన్సిల్, కలకత్తా ఇండియన్ ఛాంబరు ఆఫ్ కామర్సు, బెంగాల్ షెడ్యూల్ తరగతుల సమితి, అఖిల భారత పౌర స్వాతంత్ర్య సంఘము, అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుయొక్క జనరల్ కౌన్సిల్, మొదలైన సంస్థలెన్నో తీర్మానాలు గావించాయి. అన్నిచోట్ల బహిరంగసభలు, ప్రదర్శనాలు జరుగుతున్నాయి.

విదేశాలలో కూడా మన జాతీయవాంఛను బలపరుస్తూ ప్రజాందోళన వ్యాపించుతోంది. చైనా విద్యార్థిసంఘ నాయకులు అ. భా. విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శి పెరిన్‌బరూచాకు సందేశం పంపుతూ, చైనా ప్రజలు జరిపే స్వాతంత్ర్య పోరాటం యెడల భారతీయులు చూపిన సానుభూతిని మెచ్చుకున్నారు. యుద్ధంలో గెలవాలంటే, ఇండియా చైనాల సహకారం అత్యవసరమని వారు ప్రకటించారు. భారతదేశ సమస్యను పరిష్కరించడానికి బ్రిటిషుప్రభుత్వం మరొక ప్రయత్నం చెయ్యాలనీ, నేటి పరిస్థితులు యిలాగే కొనసాగరాదనీ, లండన్‌నుంచి న్యూస్టేట్సుమన్ పత్రికవ్రాసింది. ఇటీవలలండన్‌లో జరిగిన ఇండియా లీగ్ సమావేశంలో కూడా, భారతదేశ స్వాతంత్ర్యాన్ని బ్రిటన్ గుర్తించి, అధికారాన్ని తాత్కాలిక జాతీయప్రభుత్వానికి స్వాధీనం చెయ్యవలసిందని హెచ్చరిస్తూ తీర్మానించింది. మొన్న 7 వ తేదీని తిరిగి ప్రచురించబడిన బ్రిటిషు కమ్యూనిష్టుపార్టీ పత్రిక "డెయిలీవర్కర్" తరపున సంపాదకవర్గం, తమ మూడు ఆశయాలలో ఒకటి భారతీయుల వాంఛను ప్రభుత్వం యీడేర్చునట్లు చేయడం అని తెలియజేశారు. అమెరికాలో 38 దేశాల ప్రతినిధులు గల అంతర్జాతీయ విద్యార్థిసమావేశంలో కూడా బ్రిటన్‌కూ, భారతీయులకూ మధ్య సంప్రతింపులు జరగాలనీ, భారతీయులకు రాజకీయస్వాతంత్ర్యం యివ్వాలనీ, తీర్మానించబడింది.

ఈవిధంగా బ్రిటిషు ప్రభుత్వమే ప్రపంచ ప్రజలనుండి దూరమౌతూంది. అయితేజాతీయప్రభుత్వాన్ని లాగుకొనడానికి అవసరమైన జాతీయైక్యత మాత్రం కుదరడంలేదు. ముస్లిం లీగ్ యీ విషయంలో ముందంజ వేయనందుకు లీగ్ సభ్యులు చాలామంది అసంతృప్తి చెందుతున్నారు. సరిహద్దురాష్ట్రంలో వున్న ముస్లిం మతగురువులంతా సమావేశమై, తాము ఫాసిజాన్ని తీవ్రంగా ఎదుర్కొంటామని ప్రకటిస్తూ ఇందు కవసరమైన జాతీయ ప్రభుత్వాన్ని సాధించడానికి జిన్నా కాంగ్రెసు నాయకులతో సంప్రతింపులు జరపవలసిందని కోరారు. మద్రాసు రాజధాని ముస్లింలీగ్‌కు కార్యదర్శులైన అబ్దుల్ లతీఫ్ ఫరూకీ, అల్లాపిచ్చీ గావించిన ప్రకటనలలో జాతీయైక్యత యొక్క ప్రాధాన్యతను నొక్కి చెప్పారు. ముస్లింలీగ్ తరపున జిన్నా ముందంజవేసి, కాంగ్రెసు నాయకులతో రాయబారాలు సాగించవలసిందని కోరారు.

ఇలాగే దేశంలో వున్న ముస్లిం ప్రజలు యావన్మందీ సభలు, ప్రదర్శనాలు జరిపి, జాతీయైక్యతయొక్క ప్రాముఖ్యతను జిన్నాకు తెలియపరచాలి. ఇటు కాంగ్రెసు వాదులు ప్రత్యేక జాతుల స్వయం నిర్ణయ హక్కును గుర్తించి జాతీయైక్యతకు పాటుపడాలి.

ఇటీవల ఢిల్లీలో సమావేశమైన హిందూ మహాసభ జాతీయైక్యతకొరకు వివిధ పార్టీలతో సంప్రతింపులు జరుపడానికి ఒక కమిటీని యెన్నుకొంది. కాని, ఆ సమావేశంలో ప్యాసైన తీర్మానంచూస్తే యీ ప్రయత్నాలు సఫలం కావని తోస్తుంది. అల్ప సంఖ్యాకుల హక్కులను యిప్పుడు పరిష్కరింపజాలమనీ, యుద్ధానంతరమే వాటిని కాన్‌స్టిట్యూయెంట్ ఎసెంబ్లీలో చర్చించవచ్చుననీ, ఆ తీర్మానంలో వుంది. హిందూ మహా సభ యీ విషయంలో కాంగ్రెసు వైఖరినైనా తీసుకొనకుండా ముస్లిం ప్రజల అనుమానాలను యెక్కువ జేస్తూంది. నేటి క్లిష్ట పరిస్థితులలో భారత దేశపు వివిధ జాతుల స్వయం నిర్ణయ హక్కును గుర్తించితేనేగాని జాతీయైక్యత సాధ్యం కాదు. జాతీయైక్యత ఒకటే నేడు జయప్రదమైన జాతీయ ప్రతిఘటనకు, భారత స్వాతంత్ర్యానికి, మార్గం. (8-9-42)

Published by Katragadda Rajagopala Rao and Printed by The Popular Printers, Governorpet - Bezwada.

END OF ISSUE